శుక్రవారం
23-09-2022
విశాఖపట్నం ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 240
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Visakapatnam, Vijayawada, Hyderabad, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఉక్కు ఉద్యమ నేత చిట్టూరి
ప్రజల సహకారం మరువలేనిది
మెలి తిరిగిన స్ప్రాట్ జీవనయానం 10లో

ఎరువుల సబ్సిడీకి మంగళం?

రైతులను ఉద్ధరించడమే 'ప్రధానమంత్రి ప్రణామ్ యోజన' ముఖ్య ఉద్దేశం అని కేంద్రం అంటున్నా... అన్నదాతల నోట్లో మట్టి కొట్టేందుకేనని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి. రసాయన ఎరువులపై ఇచ్చే సబ్సిడీని భారంగా భావించి రైతు ప్రయోజనాలకు స్వస్తి పలికేందుకే పేర్లుమార్చి కొత్త పథకాలను మోదీ తెరపైకి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. వివిధ పథకాల కింద ఎరువుల సబ్సిడీని ఆదా చేసి పీఎం ప్రణామ్ యోజనకు నిధులు సమకూర్చి రైతన్నలకిచ్చే సబ్సిడీకి మంగళం పాడడానికే కేంద్రం వివిధ పేర్లతో పథకాలను ప్రవేశపెడుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

- తెరపైకి పీఎం ప్రణామ్ యోజన
- రైతు ప్రయోజనాలకు స్వస్తి
- అన్నదాతల నోట్లో మట్టికొట్టేందుకే: రైతు సంఘాలు

న్యూఢిల్లీ: రైతు భూమినే నమ్ముకుంటాడు. ఖరీఫ్, రబీ సీజన్లలో పండించటానికి అవసరమైన ఎరువులు, నాట్లు, ఇలా మరెన్నో వాటికి అప్పో సొప్పో చేసి పెట్టుబడి పెడుతుంటాడు. అయితే సకాలంలో ఎరువులు అందక రైతులు నకిలీ ఎరువులు, మందులు కొని నిట్టనిలువునా మునిగిపోతున్నారు. అప్పులు తీర్చలేక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అయినా ఏమాత్రం పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎరువులపై ఇచ్చే సబ్సిడీలకు మంగళంపాడేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇలాంటి

- మిగతా 2 లో

ఉన్నత విద్య డొల్ల!

- కాగ్ నివేదికలో వెల్లడి
- జీఎస్‌డీపీలో ఖర్చు 0.25 శాతమే
- యూజీ, పీజీ బోధన నిర్లక్ష్యం
- నూతన కోర్సులపై అశ్రద్ధ
- మూడు విశ్వవిద్యాలయాల్లో ఉత్తీర్ణత తగ్గుదల
- మూల్యాంకన వ్యవస్థ ఇక్కట్లు
- భవిష్య వార్షిక ప్రణాళికలు ప్రశ్నార్థకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఉన్నత విద్య డొల్ల తనం, వివిధ లోటుపాట్లతో కొట్టుమిట్టాడుతోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్ ఉన్నతవిద్య ఫలితాలపై భారత కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ (కాగ్) సమర్పించిన సాధారణ నివేదికలో ఇది స్పష్టమైంది. వివిధ అంశాల్లో వెనుకబాటు కన్పించింది. ఉన్నత విద్యపై కాగ్ 2014-15 నుంచి 2018-19 మధ్య కాలానికి సంబంధించిన పనితీరుపై నవంబరు 2019 నుంచి మార్చి 2020 వరకు ఆడిట్ నిర్వహించింది. మొత్తం నాలుగు అధ్యాయాలుగా విభజించి, సమగ్రంగా పరిశీలించింది. మొదటి అధ్యాయం పరిచయం, రెండో అధ్యాయం-ఉపాధి, ఉన్నత చదువుల వైపు విద్యార్థుల పురోగతి, మూడో అధ్యాయం-ఉన్నత విద్య యొక్క నాణ్యత, నాలుగో అధ్యాయం-పాలన, నిర్వహణగా విభజించి, అధ్యయనం చేసి...వివిధ లోపాలను గుర్తించింది. ఉన్నత చదువులు, ఉద్యోగాల వైపు విద్యార్థి పురోగతికి సంబంధించి విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలు పురోగతి సాధించలేక పోయాయి. చివరి సంవత్సర పట్టభద్రుల పరీక్షల్లోనూ ఆశాజనక పరిస్థితి లేదు. 2014-15తో పోలిస్తే ఆంధ్రా విశ్వవిద్యాలయం (ఏయూ) -విశాఖపట్నం, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం (ఏకేఎన్‌యూ) -రాజమహేంద్రవరం, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం(ఎస్వీయూ)-తిరుపతి, వాటి అనుబంధ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం క్రమేపీ తగ్గిపోతోంది. ఆయా విశ్వవిద్యాలయాల్లో మొక్కుబడిగానే నూతన పీజీ కోర్సులు ప్రవేశపెట్టారు. అనుబంధ కళాశాలల్లో ఐసీటీని 28.33 శాతానికే పరిమితమయ్యారు. ఉపాధ్యాయుల విద్యార్హతల్లో ప్రమాణాలు, పాలన, నిర్వహణ, సాంకేతిక, మౌలిక సౌకర్యాల కల్పనలోను, పాఠ్యాంశాల రూపకల్పనలోనూ తీవ్ర లోపం కన్పిస్తోంది. పీహెచ్‌డీ పట్టా పొందిన వారు అతి తక్కువగానే ఉన్నట్లు కాగ్ తేల్చింది. దీంతో పీజీ, యూజీ విద్యార్థులకు సమర్థ బోధనకు భరోసా లేకుండా పోతోందని స్పష్టం చేసింది. విశ్వవిద్యాలయాల మూల్యాంకన వ్యవస్థలు తీవ్రమైన కార్యాచరణ, పర్యవేక్షణ లోపాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. రాష్ట్ర స్థాయి నాణ్యతా హామీ సమన్వయ సంఘం (ఎస్ఎల్‌క్యూఏసీ) లక్ష్యాన్ని అధిగమించడంలో విశ్వవిద్యాలయాలు విఫలమయ్యాయి. ఐదేళ్లలో ఉన్నత విద్యాపై చేసిన ఖర్చు శాతం సైతం జీఎస్‌డీపీలో 0.47 శాతం నుంచి 0.25 శాతానికి తగ్గిపోయింది.

ఉన్నత చదువుల పురోగతి అంతంతే...

విశ్వవిద్యాలయాల్లో సాధారణ స్ట్రీమ్ కింద ఉన్న అన్ని కళాశాలలతోపాటు 3 విశ్వవిద్యాలయాల పరిధిలోని 26 అనుబంధ ప్రభుత్వ/ప్రైవేట్ ఎయిడెడ్/ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ కళాశాల్ని ఆడిట్ కోసం కాగ్ ఎంపిక చేసింది. వాటితోపాటు ఉన్నత విద్యాశాఖ కమిషనర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఉన్నత విద్యామండలి రికార్డులను కాగ్ పరిశీలించగా, వెనుకబాటు ఉన్నట్లు గుర్తించింది. చివరి సంవత్సర పట్టభద్రుల పరీక్షను విజయవంతంగా పూర్తిచేస్తున్న విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. ఏయూ, ఏకేఎన్‌యూ ప్రోత్సాహకంగా లేదని తేల్చిచెప్పింది. 2014-15తో పోలిస్తే, 2018-19లో ఉత్తీర్ణతా శాతం ఆ రెండు విశ్వవిద్యాలయాల్లో తగ్గింది. ఉన్నత చదువుల పురోగతి అంతంత మాత్రంగానే ఉంది. మచ్చుకు తనికీ చేసిన ఆంధ్రా, ఎస్వీయూ విశ్వ విద్యాలయాల్లో ఉన్నత చదువులకు పురోగమిస్తున్న విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రతి త్రైమాసికంలో కనీసం ఒక్కసారి సమావేశం కావాల్సి ఉంది. 2014-19 మధ్యకాలానికి 20 సమావేశాలు జరగాల్సి ఉండగా, జులై 2016, డిసెంబరు 2018 మధ్య కేవలం ఐదు సమావేశాలకే పరిమితమయ్యాయి. 2014-19 కాలానికి సంబంధించి భవిష్య, వార్షిక ప్రణాళిక, ఆర్థిక కార్య ప్రణాళికల్ని తయారు చేయలేక పోయింది. ఉన్నత విద్య నాణ్యతపై విశ్వవిద్యాలయాలు నిర్లక్ష్యం చూపుతున్నాయి. ఏకేఎన్‌యూ మాత్రం పాఠ్యాంశాల రూపకల్పనంలో ఎలాంటి అభిప్రాయాల్ని సేకరించలేదు. 2016-17 నుంచి సవరించిన యూజీ సిలబస్‌ను అమలు చేస్తున్నాయి. పీజీ కోర్సుల విషయంలో ఎస్వీయూ, ఏకేఎన్‌యూ 2016-17లో వాటి సిలబస్‌ను సవరించాయి. ఏయూ చివరిగా 2015-16లో మాత్రమే పీజీ కోర్సుల సిలబస్‌ను 26శాతం (73 కోర్సుల్లో 19) సవరించింది. నూతన కోర్సుల విషయంలోనూ అశ్రద్ధ కన్పించింది.

ఐసీటీ వినియోగంపై వెనుకబాటు

బోధన అభ్యసన ప్రక్రియలో భాగంగా కాగ్ తనిఖీల్లో బోధనా సమాచారం, ప్రసార సాంకేతికత (ఐసీటీ) సౌకర్యాల్ని పరిశీలిస్తే, ఏయూ-89శాతం, ఎస్వీయూ-86శాతం, ఏకేఎన్‌యూ-14శాతమే ఉంది. అనుబంధ కళాశాల్లో 28.33 శాతం మంది ఉపాధ్యాయులు ఐసీటీ సౌకర్యాల్ని వినినియోగిస్తున్నట్లుగా కనుగొంది. బోధనా సిబ్బంది అర్హతలు నామమాత్రంగానే ఉన్నాయి. కాగ్ మచ్చుకు తనిఖీ చేసిన 19 ప్రైవేట్ కళాశాలలకుగాను 281 మంది ఉపాధ్యాయులు పీజీ స్థాయిలో 55 శాతం మార్కులు సాధించారు. ఆరుగురు ఉపాధ్యాయులు పీహెచ్‌డీ పట్టా పొందారు. మిగిలిన 275 మంది ఉపాధ్యాయుల విద్యా, సాంకేతిక పరమైన అర్హతా వివరాలను తెలియపరచ్చలేదు. దీంతో అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) విద్యార్థులకు బోధించే అధ్యాపకులకు అవసరమైన బోధనార్హత ఉందనే అంశంపై కాగ్ భరోసా ఇవ్వలేక పోయింది. నాక్

- మిగతా 2 లో

ప్రజల గుండెల్లో ఎన్టీఆర్‌ను చెరిపేయలేరు

హెల్త్‌వర్సిటీకి పేరు మార్పుపై జూనియర్ ఎన్టీఆర్ స్పందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పుపై ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు స్పందించారు. జూనియర్ ఎన్టీఆర్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ... ఎన్టీఆర్, వైఎస్సార్ ఇద్దరూ విశేష ప్రజాదరణ సంపాదించిన గొప్ప నాయకులు. ఈ రకంగా ఒకరి పేరు తీసి ఒకరి పేరు పెట్టడం ద్వారా తెచ్చే గౌరవం వైఎస్సార్ స్థాయిని పెంచదు, ఎన్టీఆర్ స్థాయిని తగ్గించదు. విశ్వవిద్యాలయానికి పేరు మార్చడం ద్వారా ఎన్టీఆర్ సంపాదించుకున్న కీర్తిని, తెలుగు జాతి చరిత్రలో ఆయన స్థాయిని, తెలుగు ప్రజల హృదయాలలో ఉన్న జ్ఞాపకాలను చెరిపివేయలేరని ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఎన్టీఆర్‌ను అవమానించడమే: పురంధేశ్వరి

హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరును మార్చి వైఎస్సార్ పేరు పెట్టాడాన్ని మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి తీవ్రంగా

- మిగతా 2 లో

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నోటిఫికేషన్ 2లో

ఎన్ఐఏ, ఈడీ దాడులు

- పీఎఫ్ఐ కార్యాలయాల్లో విస్తృత సోదాలు
- 100మందికి పైగా అరెస్ట్
- అజిత్ దోభాల్‌తో అమిత్‌షా భేటీ

న్యూఢిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు, వ్యవస్థీకృతంగా శిక్షణ, తీవ్రవాద భావజాలం వ్యాప్తి వంటి ఆరోపణలపై పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) కార్యాలయాలు, సభ్యుల ఇళ్లపై గురువారం ఎన్ఐఏ, ఈడీ అధికారులు దాడులు చేశారు. దాదాపు 100మందికి పైగా పీఎఫ్ఐ సభ్యులను అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు సహా అనేక రాష్ట్రాల్లో ఈ తనిఖీలు జరిగాయి. మొత్తం 10కి పైగా రాష్ట్రాల్లో అరెస్టులు చోటు చేసుకొన్నాయి. ఈ మొత్తం ఆపరేషన్‌ను కేంద్ర హోంశాఖ పర్యవేక్షిస్తోంది. ఎన్ఐఏ చరిత్రలోనే అతిపెద్ద దర్యాప్తుగా దీనిని చెబుతున్నారు. మొత్తం 200 మందికిపైగా ఎన్ఐఏ అధికారులు, ఇతర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఎన్ఐఏకు వ్యతిరేకంగా కర్ణాటకలో ఆందోళన చేస్తున్న పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ సభ్యులను మంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. కేరళలోని మల్లపురం జిల్లా, మంజేరిలోని పీఎఫ్ఐ చైర్మన్ సలాం ఇంటిపై అర్ధరాత్రి నుంచి ఎన్ఐఏ తనిఖీలు మొదలయ్యాయి. అక్కడ కూడా పీఎఫ్ఐ సభ్యులు ఆందోళనకు దిగారు. కేరళలోని వేర్వేరు చోట్ల తమ సంస్థ కార్యాలయాల్లో జాతీయ దర్యాప్తు సంస్థలు తనిఖీలు చేపట్టాయని పీఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. తమ నాయకుల ఇళ్లపై కేంద్ర దర్యాప్తు సంస్థలు అర్ధరాత్రి చేపట్టిన ఈ దాడులు నిరంకుశత్వానికి ప్రతీకగా నిలుస్తాయని విమర్శించారు.

చాంద్రాయణగుట్టలో పీఎఫ్ఐ కార్యాలయం సీజ్

మరోవైపు హైదరాబాద్‌లోనూ ఎన్ఐఏ మరోసారి సోదాలు చేసింది. చాంద్రాయణగుట్టలోని పీఎఫ్ఐ కార్యాలయంలో తనిఖీలు చేసి హార్డ్ డిస్క్, పెన్ డ్రైవ్‌లు, పత్రాలను స్వాధీనం చేసుకుంది. అనంతరం కార్యాలయాన్ని సీజ్ చేసి నిర్వాహకులను విచారణకు హాజరుకావాలని ఎన్ఐఏ అధికారులు సూచించారు. దీంతో పాటు ఎల్బీనగర్, ఆటోనగర్‌లోనూ సోదాలు జరిగాయి. కరీంనగర్‌లోనూ ఎన్ఐఏ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పీఎఫ్ఐ మాజీ కార్యకర్తల కోసం ఆరా తీశారు. పరారీలో ఉన్నవారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

అమిత్ షా కీలక భేటీ

దేశవ్యాప్తంగా పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) కార్యాలయాలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాడులు

- మిగతా 2 లో

కర్ణాటకలో అంటరానితనం

కాషాయ పాలనలో దళితులపై కొనసాగుతున్న వివక్ష

దేవతా విగ్రహాన్ని తాకిన బాలుడి కుటుంబానికి రూ.60వేల జరిమానా

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం వచ్చిన 75ఏళ్ల తర్వాత కూడా దేశంలో అంటరానితనం కొనసాగుతోంది. అంటరానితనాన్ని రూపమాపడానికి ఉద్యమించిన దేశంలో నిమ్నవర్గాలు నేటికీ వివక్షకు గురికావడం దురదృష్టకరం. సమాజంలో అందరూ సమానమంటూ భారత రాజ్యాంగం హక్కులను కల్పించినప్పటికీ బీజేపీ పాలిత కర్ణాటకలో దళితులను చిన్నచూపు చూస్తూ అంటరానివారిగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మీ పేర్లేమీ నాకు నచ్చలేదయ్యా ఇపుడు మీ అందరి పేర్లూ మారుస్తా!

ఫ్లెక్సీల నిషేధంపై ఉత్తర్వులు

నవంబరు 1నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీజేసింది. ఈ నిషేధం నవంబరు 1 నుంచి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్లాస్టిక్ ఫ్లెక్సీల ఉత్పత్తి, దిగుమతికి అనుమతి లేదని తెలిపింది. ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగం, ముద్రణ, రవాణా, ప్రదర్శనపైనా నిషేధం విధించింది. నగరాలు, పట్టణాల్లో ఈ నిషేధం అమలుకు సంబంధించి అధికారులు బాధ్యత వహించాలని ఆదేశించింది. గ్రామాల్లో ఫ్లెక్సీలు వాడకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిబంధనలు అతిక్రమిస్తే ఫ్లెక్సీకి రూ.100 చొప్పున జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఉత్తర్వులు అతిక్రమిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని జీవో జారీ చేసింది. నిషేధం అమలును పోలీస్, రవాణా, జీఎస్టీ అధికారులు పర్యవేక్షించాలని తెలిపింది. ప్లాస్టిక్‌కు బదులుగా కాటన్, నేత వస్త్రాలు వాడాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

టికెట్ల లొల్లి

- ఎగబడ్డ క్రికెట్ అభిమానులు
- జింఖానా గ్రౌండ్స్‌లో రచ్చ
- పోలీసుల లాఠీఛార్జ్
- అనేకమందికి గాయాలు

2లో

క్రికెట్ అభిమానం శృతిమించడంతో మహిళలు, పోలీసులు, క్రికెట్ అభిమానులు గాయపడ్డారు. భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్ సందర్భంగా బుధవారం ఉప్పల్ స్టేడియం వద్ద కొనసాగిన పరిస్థితి, గురువారం జింఖానా మైదానంలోనూ నెలకొంది. మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను నగరంలోని జింఖానా గ్రౌండ్స్ వద్ద విక్రయిస్తున్నారని తెలియడంతో క్రికెట్ అభిమానులతోపాటు మహిళలూ ఎగబడ్డారు.

జీవితకాల అధ్యక్ష పదవిని జగన్ తిరస్కరించారు: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ జీవితకాల అధ్యక్షుడిగా వైఎస్ జగన్‌ను ఎన్నుకుంటూ జులైలో జరిగిన ప్లీనరీలో చేసిన తీర్మానం ఆమోదం పొంద లేదని, ఆ పదవిని జగన్ తిరస్కరించారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరం తెలుపుతూ స్పష్టత ఇవ్వాలని తమను కోరిందని వివరించారు. వైసీపీ జీవితకాల అధ్యక్షుడిగా జగన్ ఉండాలని జులైలో జరిగిన ప్లీనరీలో తీర్మానించిన మాట వాస్తవమేనన్నారు. వైసీపీలో ఐదేళ్ల కోసారి పార్టీ అధ్యక్షత పదవి ఎన్నికలు జరుగుతాయని సజ్జల స్పష్టం చేశారు. గత ఫిబ్రవరిలో పార్టీలో చేసిన సవరణ ప్రకారం జగనే వైసీపీ అధ్యక్షుడిగా ఉన్నారని వివరించారు. ఐదేళ్లపాటు తమ పార్టీ అధ్యక్షుడిగానే జగన్ కొనసాగుతారని, అప్పట్లో ఈసీకి పంపామని గుర్తుచేశారు.

బీజేపీని ఓడించడమే ధ్యేయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-రాజమండ్రి: ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయాల వల్ల దేశంలో ప్రాంతాలు, కులాలు మధ్య చీలిక వచ్చే ప్రమాదం పొంచి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ ఆదేశాల మేరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆయన అన్నారు. జట్లు సంఘం మేస్త్రీల సమావేశం గురువారం సంఘ అధ్యక్షుడు కుంద్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టి ఎలాగైనా రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించిన సీపీఐ... దేశంలో లౌకిక, ప్రజా స్వామిక, ప్రజా తంత్ర శక్తులతో కలిసి వెళ్లడానికి సిద్ధపడుతోందని తెలిపారు. బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యమని రామకృష్ణ పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మిక లోకం చైతన్యం అవ్వాలని, ఎప్పటికప్పుడు జరుగుతున్న రాజకీయ పరిణామాలపై దృష్టి సారించి సోషలిజం వైపు అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో విజయవాడలో జరిగే మన పార్టీ జాతీయ మహాసభలకు చాల ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. మోదీ గద్దె దిగాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని మహాసభ స్ఫూర్తితో ప్రజాపోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 14న విజయవాడలో జరిగే ప్రజా ప్రదర్శనకు పెద్ద ఎత్తున కార్మిక లోకం హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, నల్ల రామారావు, దేముడు, వెంకటరావు, అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతను విస్మరించిన ప్రభుత్వాలు

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

విశాలాంధ్ర-గుంటూరు: మహిళా సాధికారతే తమ లక్ష్యమంటూ అధికారంలోకి వచ్చిన నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ హామీని విస్మరించాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ అన్నారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో మహిళా సమాఖ్య గుంటూరు నగర జనరల్‌బాడీ సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన దుర్గాభవానీ మాట్లాడుతూ అటు దేశంలో ఇటు రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్కిస్ బానో కేసులో దోషులను విడుదల చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఆమె కుటుంబానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అత్యాచార ఘటనలలో దోషులకు ప్రభుత్వాలు కాపు కాస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ అమలులో కూడా అన్యాయం జరుగుతుందన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని మండి పడ్డారు. ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం అయిందని అన్నారు. మతత త్వాన్ని రెచ్చగొట్టి ప్రభుత్వాలు పబ్బంగడుపుకుంటున్నారని ధ్వజమెత్తారు. హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చాలని నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని ఉద్యమంలో మహిళలు అగ్రభాగాన నిలిచి పోరాడటం శుభ పరిణామమని, అదే స్ఫూర్తితో మహిళా సాధికారత, రిజర్వేషన్ల అమలుకై మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల తరువాత అక్టోబర్ 14వ తేది నుంచి విజయవాడలో సీపీఐ 24వ జాతీయ మహాసభలు జరుగనున్నాయని, ఈ మహాసభలకు గుంటూరు నగరంలోని మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలతో పాటు పార్టీ సానుభూతిపరులు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు, ఆకిటి అరుణ్ కుమార్, చల్లా మరియదాసు, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నాగలక్ష్మి, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'వికేంద్రీకరణ' గురించి వివరిస్తాం

- హెల్త్ వర్సిటీకి వైఎస్ఆర్ పేరు సమంజసమే
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి వెళ్లినప్పుడు పరిపాలన వికేంద్రీకరణ గురించి ప్రజలకు వివరిస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. స్థానిక మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో విశాఖ జిల్లా వైసీపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమావేశం గురువారం జరిగింది. గడపకు మన ప్రభుత్వం కార్యక్ర మానికి వెళుతున్నప్పుడు విశాఖపట్టణానికి రాజధాని ఎప్పుడు వస్తుందని, ముఖ్యమంత్రి విశాఖపట్నం నుంచి ఎప్పుడు పాలన ప్రారంభిస్తారని ప్రజలు తమను ప్రశ్నిస్తు న్నారని అమర్‌నాథ్ తెలిపారు. అభివృద్ధి కేవలం 29 గ్రామాలకే కాకుండా 26 జిల్లాలకు అందాలన్న తపనతో జగన్ అడుగు ముందుకు వేస్తున్నట్లు ప్రజలకు వివరిం చాలని, అలాగే సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి వస్తున్న స్పందన గురించి ఈ సమావేశంలో చర్చించామని చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారం విషయంలో తీసుకుం టున్న చర్యల గురించి కూడా చర్చించామన్నారు. ఇదే సందర్భంలో వికేంద్రీకరణకు సంబంధించి ప్రజల నుంచి మద్దతు కూడగట్టాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధిపై జగన్మోహన్ రెడ్డికి ఉన్న దార్శని కతను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి వైఎస్ఆర్ పేరు పెట్టడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు అమర్నాథ్ సమాధానం చెబుతూ, రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలోనే రాష్ట్రానికి పెద్ద ఎత్తున మెడికల్ కాలేజీలు వచ్చాయని, వైద్య రంగాన్ని విశేషంగా అభివృద్ధి చేసినందుకే హెల్త్ యూనివర్సిటీకి వైఎస్ఆర్ పేరు పెట్టారని అమర్నాథ్ స్పష్టం చేశారు. కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కనీసం అటువంటి ఆలోచన చేయలేదని, ఇప్పుడు వర్సిటీ పేరు మార్చితే బాబుకు ఎన్టీఆర్ పై ఎక్కడలేని అభిమానం పుట్టుకొచ్చిందా? అని ఆయన ప్రశ్నించారు. అమరావతి రైతులు చేస్తున్నది పాదయాత్ర కాదని, పొలిటికల్ యాత్ర అని, దానిని విరమించుకుంటే మేలని సూచించారు. జగన్‌కు విశాఖ మీద ఎనలేని ప్రేమాభిమానాలు ఉన్నా యని, టాటా గ్రూప్ చైర్మన్ కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రిని కలిసినప్పుడు ఈ గ్రూపునకు చెందిన ఏదైనా ఒక పరిశ్రమను విశాఖలో ఏర్పాటు చేయాలని కోరారు అంటే విశాఖ, ఉత్తరాంధ్ర జిల్లాలపై ఆయనకు ఉన్న మక్కువ అర్థం చేసుకోవచ్చునన్నారు. గతంలో అభివృద్ధి అంతా ఒకే ప్రాంతానికి కేంద్రీకృతమై ఉండేదని, అటువంటి పొరపాటు ఇప్పుడు జరగకూడదన్న అభిప్రా యంతోనే జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానులు ఏర్పాటు చేస్తున్నారని అమర్నాథ్ స్పష్టం చేశారు. సమావేశంలో వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి అవంతి శ్రీనివాసరావు, జీవీఎంసీ మేయర్ హరి వెంకట కుమారి, జడ్పీ చైర్మన్ సుభద్ర, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేశ్ కుమార్, నార్త్ నియోజకవర్గ ఇన్చార్జి కేకే రాజు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట రమణ, తైనాల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే కూలీ రేట్ల పెంపు

- సమ్మె యోచన విరమించుకుంటున్నాం
- జీఓను త్వరితగతిన తీసుకురావాలి
- అగ్రిమెంట్‌లోని అంశాలను అమలుపర్చాలి
- హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య

విశాలాంధ్ర-గుంటూరు: సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీలు కూలీ రేట్ల పెంపును పోరాడి సాధించుకోవడంపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్ (ఏఐటీ యూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య హర్షం వ్యక్తం చేశారు. కూలీ రేట్లు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం, కార్పొరేషన్ అధికారులు అంగీకరించడంతో సమ్మె చేయాలనుకున్న నిర్ణయాన్ని విరమించుకుంటున్నట్లు వెల్లడించారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో గురు వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీ లకు 2022 జనవరి 1 నుంచి కొత్త కూలీ రేట్లు అమలు చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం, కార్పొరేషన్ అధికా రులు గత 9 మాసాలుగా కాలయాపన చేశారన్నారు. ఈ నేపథ్యంలో యూనియన్ నాయకత్వం అటు ప్రభుత్వంతో, ఇటు అధికారులతో పలు దఫాలుగా చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ దశలో ఈ నెల 26వ తేది నుంచి సమ్మెలోకి వెళ్ళాలని నిర్ణయించి నోటీ సును అందజేయడం జరిగిందన్నారు. సమ్మె సన్నాహాలలో భాగంగా ఈ నెల 15వ తేది నుంచి దశల వారీ నిరసన కార్యక్రమాలను కార్మికులు నిర్వహించారని, నల్లబ్యాడ్జీలు, చెవులో పూలు, తహశీల్దార్‌లకు వినతిపత్రాలు అంద జేయడం, జేసీ కార్యాలయాల ఎదుట అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహించడం వంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. దీంతో దిగివచ్చిన ప్రభుత్వం యూని యన్‌లతో చర్చలు జరిపింది. మంత్రి జోక్యం చేసుకో వడంతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్ళి క్వింటాకు రూ.25 చెల్లిస్తామని చెప్పారని తెలిపారు. దీంతో కొంత ఊరట లభించిందని, వాస్తవానికి రూ.4లు పెంచాల్సి ఉన్నప్పటికి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ప్రతిపాదనను యూనియన్ అంగీకరిం చిందన్నారు. దీంతో సమ్మెను విరమించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా బోనస్ కూడా పెంచుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అగ్రిమెంట్‌లో పొందుపరచిన వాటిని పెంచి జీఓ ఇవ్వాలని, ఎటువంటి జాప్యం లేకుండా జీఓను త్వరితగతిన ఇచ్చి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. రాబోయే కాలంలో కార్మి కులకు రావాల్సిన న్యాయమైన సౌకర్యాల కోసం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. కూలీ రేట్ల పెంపుకు సహకరించిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కార్పొరేషన్ ఎండీ వీరపాండ్యన్‌కు కృతజ్ఞ తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు, ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, గుంటూరు జిల్లా కార్యదర్శి కోట్ల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-2పై స్పష్టతివ్వాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎంఈవో-2పై స్పష్టత ఇవ్వాలని, ఉపాధ్యాయుల పదోన్నతులపైన మార్గదర్శకాలు విడుదల చేసిన తర్వాతే పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, హెచ్‌తిమ్మన్న గురువారం ఇబ్రహీంపట్నం విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ సంయుక్త సంచాలకులు మువ్వా రామలింగానికి వినతిపత్రం అందజేశారు. విద్యా రంగానికి సంబంధించి చాలా అంశాల్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్య ఆధారిత అంతర్జాల హాజరుపైన చాలా అభ్యంతరాలున్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. పాఠశాల విద్యార్థుల ఎదుట మొబైల్ ఫోన్ పట్టుకుని, ఉపాధ్యాయులు ముఖ ఆధారిత హాజరు వేయ డం ఇబ్బందిగా ఉందని, దీనిని తక్షణమే వేలిముద్రలకు మార్చాలని డిమాండ్ చేశారు. అంతర్జాల హాజరుకు మేం వ్యతిరేకం కాదని అయితే ముఖాధారిత హాజరు సరిగా పనిచేయడం లేదని ముఖానికి బదులుగా వేలిముద్ర ఆదరిత అంతర్జాల హాజరుకు మార్పు చేయాలని కోరారు. త్వరలో భర్తీ చేయనున్న దాదాపు 900మంది ఎంఈఓ-2 పోస్టుల పదోన్న తులు, 2800 లెక్చరర్ పోస్టుల పదోన్నతులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేయాలన్నారు. ప్లస్ టు విధానంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పదోన్నతులకు సంబంధించి విధివిధానాలు రూపొందిం చాలని కోరారు. ఎంఈవో-2 అధికారాలు సైతం మొదటి ఎంఈవోకు సమాంతరంగా ఉండాలని సూచించారు. 4500 స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను ఉమ్మడి సీనియార్టీ ఆధారంగా చేయాలన్నారు. ఉపాధ్యాయులకు నిలిచిపోయిన భవిష్యనిధి, జీవిత బీమా బకాయిలు, కరవు భత్యం, పదవీ విరమణ మొత్తాలు చెల్లింపులపై దృష్టి సారించాలని, దాంతోపాటే పెండింగ్ ఉన్న కరువు భత్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

25 మంది విద్యార్థులకు అస్వస్థత

విశాలాంధ్ర-పుట్టపర్తి: మండలంలోని మిట్టపల్లి పంచాయ తీలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విషపూరితంగా మారిన ఆహారం తినడంతో 25మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎంపీడీవో పోలప్ప, ఎస్ఐ కే గోపీ తెలిపారు. హాస్టల్ వార్డెన్‌కి చెందిన కుటుంబ సభ్యుల పుట్టినరోజు సందర్భంగా రవ్వతో చేసిన కేసరిని వసతి గృహంలోని విద్యార్థులకు అందజేశారు. అరగంట అనంతరం విద్యార్థులు వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. దీన్ని గమనించిన హాస్టల్ సిబ్బంది విద్యార్థులను 108కి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన హాస్టల్‌కు చేరుకున్న 108 సిబ్బంది 17మంది విద్యార్థులను కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరో ఎనిమిది మందికి మండల కేంద్ర ప్రాథమిక ఆరోగ్య వైద్యశాలలో మెరుగైన చికిత్స అందిస్తున్నారని, పది మంది విద్యార్థులకు ప్రథమ చికిత్స చేసి హాస్టల్‌కు పంపినట్లు తెలిపారు. అయితే అస్వస్థతకు గురైన 25 మంది విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని, త్వరలో కోలుకొని వసతి గృహం చేరుకుంటారని వారు వివరించారు. ఈఓఆర్డీ రాజశేఖర్, సర్పంచ్, గ్రామ కార్యదర్శి గౌస్ మహమ్మద్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పర్యవేక్షించారు. అయితే విద్యార్థులు తల్లిదండ్రులు, ఏబీవీపీ సంఘం నాయకులు మిట్టపల్లి హాస్టల్ వద్ద వార్డన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు.

ఎన్టీఆర్‌కు చంద్రబాబు ద్రోహం

- చరిత్రపుటల్లో నిలిచేలా ఎన్టీఆర్‌జిల్లా
- గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్టీ రామారావు గుండెల్లో చంద్రబాబు గుణపందింపి, ద్రోహం చేశారని గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యా లయంలో గురువారం ఆయన విలేకరుల సమా వేశాన్ని నిర్వహించారు. గవర్నర్‌ను కలిసి వచ్చిన తర్వాత చంద్రబాబు చాలా మాట్లాడారనీ, ఎక్కడ లేని బాధ వ్యక్తం చేశారన్నారు. నిజానికి ఆనాడు ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి, పదవి లాక్కుని, చివరకు ఆయన మరణానికి కారణమైన చంద్రబాబు, ఇవాళ తనకు మాత్రమే ఎన్టీఆర్‌పై ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారని ఎద్దేవా చేశారు. నిండు మనసుతో సగర్వంగా చెబుతున్నామని, ఎన్టీఆర్ పేరుతో జిల్లా ఉంటుందని, ఆ విధంగా ఆయనకు శాశ్వత పేరు, గుర్తింపు ఉంటుందని, అది చరిత్రపుటల్లో కూడా నిల్చిపోతుందని పేర్కొ న్నారు. సీఎం జగన్‌కు, ఎన్టీఆర్‌పై ప్రేమ, అభిమానం, గౌరవం ఉన్నాయి కాబట్టే...ఎవరూ అడగకపోయినా, ఆయన జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టారని గుర్తుచేశారు. పాదయాత్ర చేస్తున్నప్పుడు నిమ్మకూరులో ఆయన ప్రతిపక్షనేతగా ఆ మాట ఇచ్చారని, ఆ మేరకు దానిని నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. ఇప్పుడు తెగ బాధపడుతున్న, గగ్గోలు పెడుతున్న చంద్రబాబు, 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్ప టికీ, ఆ పని ఎందుకు చేయలేదంటూ ప్రశ్నించారు. కనీసం ఆ ఆలోచన కూడా చేయలేదనీ, దీన్ని ప్రజలు, ఎన్టీఆర్ అభిమానులు ఆలోచించాలని కోరారు. అసలు ఎన్టీ రామారావు పేరును ఉచ్చరించే హక్కు చంద్రబాబుకు ఉందా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో హెల్త్ వర్సిటీకి డాక్టర్ వైఎస్సార్ పేరు పెడుతూ చట్టం చేస్తూ, చర్చించామన్నారు. దానికి చంద్ర బాబు హాజరు కావొచ్చు కదా? అని నిలదీశారు. వైద్య ఆరోగ్య రంగంలో వైఎస్ఆర్ చాలా సంస్క రణలు అమలు చేశారన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో అంత సేవ చేసిన వైఎస్సార్ పేరు చిరస్థాయిగా నిల్చేలా ఆయన పేరు పెడితే తప్పేమిటనేదీ అందరూ ఒక్కసారి ఆలోచించాలన్నారు. ఎన్టీఆర్‌పై జగన్‌కు ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయని పునరుద్ఘాటించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1983 వరకు రాష్ట్రంలో కేవలం 8 వైద్య కళాశాలలు మాత్రమే ఉండగా, మహానేత వైఎస్సార్ హయాంలోనే మరో మూడు మెడికల్ కాలేజీలు వచ్చాయని వివరించారు. సీఎం జగన్ ఇప్పుడు ఏకంగా 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నా రన్నారు. చరిత్ర పుటల్లో నిల్చే విధంగా జిల్లాకు ఎన్టీఆర్ పేరుపెడితే చంద్రబాబు కనీసం స్వాగతిం చలేదనీ, హర్షించలేదని చెప్పారు. చివరకు ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు కూడా ఆ పని చేయలేదన్నారు. ఎన్టీఆర్‌పై నిజమైన గౌరవం, అభిమానం ఎవరికి ఉన్నాయి? మాకు ఉన్నాయా?, మీకు ఉన్నాయా? అంటూ ఆయన ప్రశ్నించారు.

'మన్యం' మరణాలపై విచారణ: సీపీఐ

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం: మన్యంజిల్లాలోని మన్యం ప్రాంతాలలో ఇటీవల కాలంలో వైద్య సదుపాయాలు అందక గర్భిణీలు, శిశువుల మృతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా సీపీఐ కార్యదర్శి కే మన్మథరావు, సహాయ కార్యదర్శి జీవన్న డిమాండ్ చేశారు. గురువారం వారు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన గిరిజనుల 'వేదన... రోదన!' వార్త యదార్థమని చెబుతూ గిరిజనుల ఆవేదనను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. రిఫరల్ పేరిట ఆసుపత్రి సిబ్బంది చేస్తున్న నిర్వాహకంతోనే, రక్తహీనత వల్ల ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయ న్నారు. జిల్లా ఆసుపత్రిలో గైనికాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టరు సూపరిం టెండెంటుగాను, జిల్లా ఆసుపత్రిల సమన్వయ అధికారిగా ఉండటంతో పూర్తిసేవలు అందడం లేదన్నారు. గైనకాలిజిస్టులను పెంచాలని, రెగ్యులర్ డీసీహెచ్‌ఎస్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. గ్రామీణప్రాంతాల్లోని ఆసుపత్రులు గర్భిణీలకు డెలివరీ చేయలేని స్థితిలో ఉండటం దారుణ మన్నారు. జిల్లాఆసుపత్రికి గర్భిణీ చేరుకున్న వెంటనే వైద్యులు బీపీ చూడ కుండా, బీపీ తక్కువని, రక్తం చూడకుండా రక్తం తక్కువని చెబుతున్నారనీ ఇది చాలా దారుణమన్నారు. రక్తం తెస్తే ఆపరేషన్ చేస్తామని లేదంటే తల్లిబిడ్డకు కష్టమని చెప్పడంతో పేషెంట్‌తో వచ్చేవారు పడుతున్న నరకం అంతా ఇంతా కాదన్నారు. ప్రైవేటు ఆసుపత్రిలో అన్ని సదుపాయాలతో సేవలు చేసి డెలివరీచెస్తే రూ.20వేలు తీసుకుంటే, ఇక్కడ మాత్రం అరకొరసేవలు అందించి రూ.30-40వేలరూపాయల వరకు వసూలు చేయడమేంటని ప్రశ్నించారు. ఈ ఘటనలపై జిల్లా అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మన్యం ప్రాంతాల్లో రహదారి సదుపాయాలు లేక డోలీలపై గర్భిణులను తీసుకుని వస్తున్న సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీలో రూ.3వేల కోట్లతో ప్రాజెక్టులు: గడ్కరీ

విశాలాంధ్ర-రాజమహేంద్రరం: ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.3వేల కోట్లతో ఎనిమిది ప్రాజెక్టులు చేపట్టనున్నామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం మంత్రి నితిన్ గడ్కరీ జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ రహదారులు పూర్తయితే కాకినాడ సెజ్ పోర్ట్, ఫిషింగ్ హార్బర్, కాకినాడ యాంకరేజ్ పోర్టులకు, గ్రీన్ ఫీల్డ్ రోడ్ కనెక్టివిటీని అందజేస్తాయని, దీనివల్ల బియ్యం, సీ ఫుడ్, ఆయిల్స్, ఐరన్ ఎగుమతులు సాఫీగా జరుగుతాయన్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఖనిజం, జీవ ఇంధనం, గ్రానైట్ మొదలైనవి ఎంతో సులభతరంగా రవాణా సాధ్యమవుతుందన్నారు. కైకరం, మోరంపూడి, ఉండ్రాజవరం, తేతలి, జొన్నాడ వద్ద ఐదు ఫ్లై ఓవర్‌లను నిర్మించనున్నామని, అవి పూర్తయితే అనేక ప్రాంతా లకు ఇబ్బందులు లేకుండా సురక్షితమైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. ఉండ్రాజవరం, నిడదవోలు, తణుకు టౌన్, కైకరం బ్లాక్‌స్పాట్‌లను సరిదిద్దడానికి ప్రత్యేక భద్రతా ఫీచర్లు అనుగుణంగా ఈ రహదారుల నిర్మాణం ఉంటుందన్నారు. వాకలపూడి-ఉప్పాడ-అన్నవరం-సామర్లకోట-అచ్చంపేట జంక్షన్ నాలుగు లైన్ల రహదారి, రంపచోడవరం నుంచి కొయ్యూరు వరకు పక్కాగా ఉన్న భుజాలతో రెండు లైన్ల నిర్మాణంతో సహా ఇతర మూడు ప్రాజెక్టులు నిర్మిస్తున్నామ న్నారు. సామర్లకోట, అన్నవరం, బిక్కవోలు, ర్యాలి- పిఠాపురం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలకు రహదారి అనుసంధానం చేస్తామని తెలిపారు. పర్యాటక ప్రాంతాలైన అరకు, లంబసింగి వంటి గిరిజన ప్రాంతాలకు, అరకు లోయ, బుర్రా గుహలు వంటి ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలకు రహదారి సౌకర్యం సాకారం కానున్నదన్నారు. కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల ద్వారా సురక్షితమైన, మెరు గైన, వేగవంతమైన అంతర్రాష్ట్ర రహదారుల అనుసంధానం సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ కేంద్ర మంత్రి గడ్కారి విన్నూత్నమైన ఆలోచనతోనే దేశంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి వచ్చి ఉభయ గోదావరి జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టు పనుల శంకుస్థాపనకు రావడంపై ఇక్కడి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు. రహదారుల నిర్మాణంతో ఈ ప్రాంతం ఎంతో ఆర్థికంగా పురోగతి దిశలో నడుస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో భాగంగా సభా ప్రాంగణంలోకి చేరుకున్న కేంద్ర మంత్రికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అదే ప్రాంగణంలో రాష్ట్రంలో అభివృద్ధి పరిచిన జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రద ర్శన తిలకించారు. పది మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. తదుపరి సభా వేదికకు చేరుకొని జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం రాష్ట్రంలో చేపడుతున్న ఎనిమిది జాతీయ రహదారి పనులకు వర్చువల్ విధానంలో శంఖు స్థాపన చేశారు. రాజ్యసభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ ఎంపీ వంగా గీత, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, అరకు ఎంపీ జి.మాధవి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చియ్య చౌదరి, జక్కంపూడి రాజా, తలారి వెంకటరావు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, జి. శ్రీనివాస నాయుడు, డీసీసీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, జిల్లా కలెక్టరు డా. కె.మాధవీలత, మున్సిపల్ కమిషనర్ కె. దినేశ్ కుమార్, రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్ తొలి విడత సీట్ల విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఈఏపీసెట్-2022 కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా తొలి విడత ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ సీట్లను గురువారం సాయంత్రం నుంచి విడుదల చేశారు. అర్హత పొందిన విద్యార్థులకు ఇటీవల వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సీట్లు పొందిన వారంతా ఈనెల 27వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి. సీట్లు పొందిన అభ్యర్థుల రిజిస్టర్ ఫోన్‌కు కన్వీనర్ ద్వారా సమాచారం అందించారు. వారంతా ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్ ద్వారా అలాంట్‌మెంట్ లెటర్, సెల్ఫ్ రిపోర్టింగ్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలి. విద్యార్థులు వెబ్ కౌన్సెలింగ్ సమయంలో పొందుపరిచిన విద్యార్హత, కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాల నకళ్లతోపాటు అలాట్‌మెంట్, సెల్ఫ్ రిపోర్టింగ్ పత్రాలను ఖరారైన కళాశాలలో 27లోగా రిపోర్టు చేయాలి. తొలి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొంది, వాటిపై సంతృప్తి లేని వారంతా మళ్లీ రెండో విడత కౌన్సెలింగ్‌కు ఎలాంటి కన్వీనర్ ఫీజు లేకుండా పాల్గొనవచ్చు. పూర్తి వివరాలను ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో ఉంచారు.

VMRDA VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

"e"- Procurement Tender Notice

VMRDA invites the following tender on "e" Procurement Platform

Sl. No	Tender Notice No.	ECV in Rs.	Last Date & Time
1	26/2022-23/SE/EE-I/VMRDA, Dt.22-09-2022 (3rd call)	Rs.70,55,646/-	29-09-2022
2	27/2022-23/SE/EE-I/VMRDA, Dt.22-09-2022 (3rd call)	Rs.70,44,938/-	29-09-2022
3	28/2022-23/SE/EE-I/VMRDA, Dt.22-09-2022 (3rd call)	Rs.52,27,727/-	29-09-2022
4	29/2022-23/SE/EE-I/VMRDA, Dt.22-09-2022 (3rd call)	Rs.52,27,727/-	29-09-2022
5	30/2022-23/SE/EE-I/VMRDA, Dt.22-09-2022 (3rd call)	Rs.56,42,500/-	29-09-2022
6	31/2022-23/SE/EE-I/VMRDA, Dt.22-09-2022 (3rd call)	Rs.55,04,878/-	29-09-2022
7	36/2022-23/SE/EE-VI/VMRDA, Dt.22-09-2022	Rs.17,89,740/-	29-09-2022
8	37/2022-23/SE/EE-VI/VMRDA, Dt.22-09-2022	Rs.21,60,688/-	29-09-2022
9	38/2022-23/SE/EE-VI/VMRDA, Dt.22-09-2022	Rs.14,01,291/-	29-09-2022
10	17/2022-23/SE/EE-IX(Ele)/VMRDA, Dt.22-09-2022 (2nd call)	Rs.3,89,594/-	29-09-2022

For details logon to www.apeprocurement.gov.in

Sd/- Metropolitan Commissioner, VMRDA

సంపాదకీయం

ఇది పేర్ల మార్పు రుతువులా ఉంది. యోగీ ఆదిత్యనాథ్ నాయకత్వంలోని ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా కొన్ని పేర్లు మార్చింది. పాత పేర్లు మార్చి తమ పార్టీ నాయకుల పేర్లు పెట్టారు. లేదా హిందుత్వను ప్రోత్స హించే విధంగా మరో పేరేదో పెట్టారు. ఇదే సంప్రదాయాన్ని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కూడా అను సరిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉండగా విజయవాడ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరు బుధవారం వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చేశారు. శాసనసభలో దీనికి సంబంధించిన బిల్లు ప్రతిపాదించినప్పుడు తెలుగుదేశం సభ్యులు గొడవ చేస్తే వారిని సభనుంచి సస్పెండ్ చేసి మరీ పేరు మార్పును మూజువాణీ ఓటుతో శంఖంలో పోసేశారు. ఎన్.టి.ఆర్. ఆరోగ్య విశ్వ విద్యాలయానికి ఆ పేరు రావడానికి ఓ చరిత్ర ఉంది. ఎన్.టి.ఆర్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైద్య విద్యకోసం ప్రత్యేకంగా విశ్వవిద్యా లయమే ఉండాలని భావించి 1986లో ఆరోగ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. ఎన్.టి.ఆర్. మరణించిన తరవాత తెలుగు దేశం ప్రభుత్వం ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్.టి.ఆర్. పేరు పెట్టింది. ఆ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన 36 ఏళ్లకు పేరు మార్చవలసిన అవసరం ఏమిటని తెలుగు దేశం ప్రశ్నిస్తోంది. సీపీఐ, సీపీఎం, బీజేపీ కూడా ఎన్.టి.ఆర్. పేరు మార్చి వై.ఎస్.రాజశేఖర రెడ్డి పేరు పెట్టినందుకు అభ్యం తరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రులుగా వై.ఎస్.రాజశేఖర రెడ్డి, తెలుగు దేశం వ్యవస్థాపకుడు, ఆ ప్రాంతీయ పార్టీ తరఫున తొలి ముఖ్య మంత్రి అయిన ఎన్.టి. రామారావు ప్రజాభిమానం చూరగొన్న నాయకులే. వారి గౌరవార్థం విశ్వవిద్యాలయానికో, మరో సంస్థకో వారి పేర్లు పెట్టడం తప్పు కాకపోవచ్చు. కానీ ప్రభుత్వాలు మారినప్పుడల్లా అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలు తమకు అభిమాన పాత్రులైన వారి పేర్లు పెట్టడంతోనే తంటా వస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన అనేక పథకాలకు నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ లాంటి పేర్లు తగిలించినప్పుడే ఆ వ్యవహారం వివాదాస్పదమైంది. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి రాజీవ్ గాంధీ పేరు పెట్టినప్పుడు తెలుగు దేశం పార్టీ ఎన్.టి. రామారావు పేరు పెట్టాలని గట్టిగా కోరింది. కాని విమానాశ్రయ నిర్మాణం జరుగుతున్న దశలో అధికారంలో ఉన్నది వై.ఎస్.రాజశేఖర రెడ్డి కనక ఆయన మాటే చెల్లి అది రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం అయింది. జగన్ ప్రభుత్వం సహజంగానే ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఉన్న ఎన్.టి.ఆర్. పేరు తీసేసి రాజశేఖర్ రెడ్డి పేరు పెట్టడాన్ని సమర్థించుకుంటోంది. ఎన్.టి.ఆర్. మీద జగన్ కు అపారమైన గౌరవం ఉండబట్టే విజయవాడ జిల్లాకు ఎన్.టి.ఆర్. పేరు పెట్టారని ఉదాహరణ చూపి వాదిస్తున్నారు. ఆరోగ్య రంగానికి రాజశేఖర రెడ్డి చేసిన సేవకు గుర్తింపుగా ఎన్.టి.ఆర్. ఆరోగ్య విశ్వవిద్యాలయానికి వై.ఎస్. రాజశేఖరరెడ్డి పేరు పెడ్తే తప్పేమిటి అంటు న్నారు. ఇక్కడ అభ్యంతరం వై.ఎస్.ఆర్. పేరు పెట్టడం మీద కాదు. ఉన్న పేరు తీసి ఆయన పేరు తగిలించడం మీద మాత్రమే.

ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేసే ఇలాంటి సంస్థలకు ఫలానా రాష్ట్ర ప్రభుత్వం అని జోడిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఉదాహరణకు

ఎన్.టి.ఆర్. పేరు తొలగించడం మహాపచారమే

హైదరా బాద్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినప్పుడు మొదట్లో దాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అనే అన్నారు. ఆ తరవాత దాన్ని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో అధికారంలోకి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితి ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పేరు మార్చి ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా మార్చారు. విభజన తరవాత బాపట్ల వ్యవసాయ కళాశాలకు విశ్వవిద్యాలయ హోదా కల్పించి కొత్త రూపు దాల్చిన వ్యవస్థకు ఆచార్య ఎన్.జి.రంగా పేరు పెట్టారు. ఇలాంటి వివాదాలు, ఉన్న పేర్లు మార్చి కొత్త పేర్లు పెట్టడం తెలుగునాట మాత్రమే ఉన్న వ్యవహారం కాదు. మహారాష్ట్రలో ఔరంగాబాద్‌లో మరాఠ్వాడా విశ్వవిద్యాలయం ఉండేది. దీనికి డా. బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టాలని పెద్ద ఎత్తున ఉద్యమం జరగడమే కాక అది రక్తసిక్తమైంది. ఇప్పుడు మరాఠ్వాడా విశ్వవిద్యాలయం పేరు పూర్తిగా మార్చకుండా డా. బి.ఆర్. అంబేద్కర్ మరాఠ్వాడా విశ్వవిద్యాలయం అంటున్నారు. వివిధ సంస్థ లకు, వ్యక్తులకు కీర్తి శేషులైన వారి పేరో లేదా సజీవంగా ఉన్న వారి పేరో పెట్టినప్పుడల్లా వివాదాలు రేకెత్తు తున్నాయి. మరణించిన వారి పేర సంస్థలు, వ్యవస్థలు నెలకొల్పడం మన దేశంలోనే కాదు ఇతర దేశాల్లోనూ ఉంది. ఉదాహరణకు లుముంబా విశ్వవిద్యాలయాన్నే చెప్పుకోవచ్చు. కానీ నాయకులు సజీవంగా ఉన్నప్పుడే ఉన్న పేరు తీసేసి కొత్త పేరు పెట్టడానికి భేషైన ఉదాహరణ గుజరాత్‌లోని క్రికెట్ స్టేడియంకు ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ పేరు పెట్టడం. వ్యక్తి ఆరాధనను ఆపడం సాధ్యం కాక పోవచ్చు. నాయకులు తాము సజీవంగా ఉండగానే వ్యక్తి ఆరాధనను ప్రోత్స హించడం విచిత్రమే కాదు వైపరీత్యం అవుతుంది. మోదీ సర్కారుకు నెహ్రూ పేరెత్తితే కంపరం పుట్టుకొస్తుంది. నెహ్రూ మరణం తరవాత ఇందిరా గాంధీ హయాంలో 1969 ఏప్రిల్ 22న జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జె.ఎన్.యు.) నెలకొల్పారు. నెహ్రూ స్థాయికి తగ్గట్టే ఆ విశ్వవిద్యాలయం దేశంలోనే మేటి విశ్వవిద్యా లయంగా నిలిచింది. కానీ ఆ విశ్వవిద్యాలయం భిన్న భావాలు సంఘర్షించ డానికి అవకాశం ఇవ్వడాన్ని ప్రోత్సహిస్తుంది. అది మోదీ సర్కారుకు నచ్చ లేదు. అందుకని ఆ విశ్వవిద్యాలయాన్ని అపఖ్యాతి పాలు చేయడానికి చేయని ప్రయత్నమే లేదు. పేరులోన ఏమున్నది పెన్నిధి అని షేక్స్పియర్ అన్నా కొంతమందికి కొన్ని పేర్లు భూతంలా కనిపిస్తాయి. ఇంకోవేపు తమకు ఇష్టమైన వారి పేర్లు పెట్టడానికి అధికార పక్షాలు పడరాని పాట్లు పడ్తుంటాయి. జె.ఎన్.యు.కు అంతర్జాతీయ ఖ్యాతి నెహ్రూ పేరువల్ల రాలేదు. ఏ విశ్వవిద్యాలయంలోనైనా బోధన, పరిశోధన బలంగా ఉన్న వ్పుడే పేరు ప్రఖ్యాతులు వాటంతట అవే వస్తాయి. అలాంటి విశ్వవిద్యా లయాల పేరు చూసి జడుసుకున్నట్టే కేవలం పేరు మార్పు వల్ల విశ్వవిద్యా లయం గొప్పదైపోదు. ఈ ఇంగితం ఆంధ్ర ప్రదేశ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రదర్శించలేక పోయారు. ఆయన హయాంలో ఒక్క కొత్త విశ్వ విద్యాలయం కూడా రాలేదు. ఉన్నవాటి పేర్లు మార్చి ఏదో సాధించామని చెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఎన్.టి.ఆర్. రాజకీయ నాయకుడు కాక ముందు విశేషంగా అభిమానులను సంపాదించుకున్న సినీ నటుడు. ఆయ నను అభిమానించేవారు ఆయన రాజకీయాల ఆధారంగా ఆ పని చేయడం లేదు. అందుకే ఎన్.టి.ఆర్. పేరు మార్చడం పెద్ద వివాదంగా మారింది. విశ్వవిద్యాలయాలను మెరుగు పరచడానికి వాటిలో ఖాళీలను భర్తీ చేయడం మీద ముఖ్యమంత్రి జగన్ దృష్టి పెట్టి ఉంటే మన్ననలు పొందే వారు. కానీ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరు మార్చే చిట్కా ప్రయోగించడం వల్ల విమర్శలకు అవకాశం కల్పించారు. చేసిన తప్పు దిద్దుకునే అలవాటు సాధారణంగా జగన్ లాంటి పాలకులకు ఉండదు. అదే పెద్ద విషాదం. కాదు మహాపచారం!

తలసరి ఆదాయం

రా బావ ఏంటి ఆలో చిస్తూ వేళ్లతో లెక్కలు వేస్తూ వస్తున్నావు. దారిలో ఎవరి ఉపన్యాసం విన్నావు. అవును బావా వస్తూ ఉంటే లెనిన్ సెంటరులో తలసరి ఆదా యమే కాదు తలసరి ఆనందం అవసరమని ఆదా యం ఉన్న వాళ్లంతా ఆనందంతో బత కడం లేదని ఒక బుద్ధిస్టు గుక్క తిప్పుకోకుండా మాట్లాడు తున్నాడు. అయితే ఆదాయం లేకుండా ఆనందం ఎలా వస్తుంది బావ. నీ ప్రశ్న కరెక్ట్ బావ. బుద్ధుణ్ణి మార్క్సు కాదనలేదు బావ. మనిషి బతకడానికి ముందు ఆదాయం అవసరం. కడుపు నిండిన తరవాతనే కద మనిషికి ఆనందం. కాని ఆదాయం అంతా ఒక శాతం మంది చేతుల్లోకి చేరుకుంటే 99 మంది ఆకలితో అలమటిస్తుంటే ఆనందం ఎక్కడి నుండి వస్తుంది బావ.

నిజమే బావ కాని వేలాది కోట్లు గడించిన వారు కూడ శారీరకంగా, మానసికంగా ఆనందంగా లేరు కదా బావ. నిజమే బావ అయితే పేదవాడిది క్షుద్బాధ. ఉన్నవాడిది సొమ్ము దాచుకునే ప్రయత్నంలో నిద్రలేమి వల్ల వచ్చే



వ్యాధుల బాధ. కాని మనిషికి ఆనందం ముఖ్యమే. అది మనసుకు శాంతి చేకూరినపుడే లభ్యం అవుతుంది. అది నిజమే బావ. ఎవరిని చూసినా మనసు బాగా లేదంటారు. నిజమే బావ మనసుకు శాంతి చేకూరాలంటే కోరి కలు తీరాలి. కాని ఈ రోజున కోరికలు గుర్రాల వలె పరుగులు పెడు తున్నాయి. పెట్టుబడిదారులు రోజుకో కొత్త వస్తువు తయారుచేసి బజారులో పెడుతున్నారు. పక్కవాడు కొని ఆనందిస్తుంటే మరి అశాంతి మొదలై మనసు పాడవుతుంది గదా. నిజమే బావ పరస్పర సహకారంతో బతికే రోజుల్లో వస్తు మార్పిడి యుగంలో యిటువంటి ఈతి బాధలు లేవు కద బావ. అంతేగాక మార్పుకు అవతల ఉన్నది మనం గ్రహించాలి. అదే మానవ వాదమని, అదే బుద్ధిజం అని కూడా ఉపన్యాసకుడు అన్నాడు బావ. దాన్ని ఎవరూ కాదనరు బావ. కాని మార్క్సు కోరే సమ న్యాయం, సమ ఆదాయం ముందు చేకూరిన తరవాత కద మనిషి మనసును సంస్కరించేది. ఆకలితో అలమటించే మనిషికి మనసును సంస్కరించుకో అంటే వినబడుతుందా బావ. అందుకే ముందు ఆర్థిక సమానత్వం అవసరమని మార్క్సు ఆలోచించాడు బావ. బావ మరో సందేహం అసలు బుద్ధిజం యిప్పటికీ అవసరమేనా!

మంచి ప్రశ్న బావ. ఆనాటి పరిస్థితులు గమనించిన బుద్ధుడు అన్నీ త్యజించి వీధిన పడ్డాడు. మనిషికి కావలసిందేమిటో చెప్పాడు. ప్రతి మనిషి కారుణ్యంతో తనను తాను ప్రేమించుకున్నట్లు ఎదుటవాడిని ప్రేమించాలి అన్నాడు. మనిషి చేతిలో ఆయుధం కాదు, మాటలో కారుణ్యం అవసర మన్నాడు. ఆయన అహింసా వాదమే మహాత్మాగాంధీ అనుసరించాడని చెప్పవచ్చు. కాని అటువంటి అహింసా మూర్తిని కరుడు గట్టిన హిందూత్వ వాది కాల్చి చంపాడు కదా. ఆ తరవాత ఎంతమంది గాంధీలాగ అహింసా మూర్తులు బయటకొచ్చారు చెప్పు. నిజమే. మారుతున్న కాలంతో పాటే ప్రణా ళికలు మారాలి. అందుకే అవసరమయితే సాయుధ పోరాటం తప్పదన్నాడు మార్క్సు. కడుపు నిండకుండా ఆనందం ఎక్కడ నుండి వస్తుంది బావ.

అది సరే బావ ఆయన మరొక మాట అన్నాడు. తలసరి ఆదాయం తలసరి ఆనందం తలసరి దుఃఖం అన్నాడు బావ. అదేంటో నా కర్థం కాదు. నిజమే. పాలించే వారు అసమర్థులై అంతులేని అప్పులు చేస్తే దానివల్ల ప్రజలందరికి తలసరి దుఃఖం కలుగక తప్పదు కద బావ. అది సరే బావ. మానవతా వాదులు మనిషి మారితేనే సమాజం నిర్మించుకున్న వ్యవస్థ మారుతుందని అది చట్టాల వల్ల కాదని ప్రతి మనిషిని మానవత్వం నిండిన మనిషిగా మార్చాలంటారు అదేంటి బావ. ఒక్క విషయం మనం గమ నించాలి బావ. ఆ రకంగా చెప్పేవారు బయటకు రారు, వాళ్ల పరిధి దాటరు. మనుషుల్ని ఎలా మారుస్తారు బావ. ఎంతో మేధావి అయిన అంబేద్కరు ఏదో ఒక మతం అవసరమని, మతాతీత ఆలోచనలోకి ప్రజలు రావడం లేదనే ఆయన బుద్ధిజం స్వీకరించాడని నాకనిపిస్తుంది బావ. అది సరే బావ బుద్ధుడు చెప్పింది ఎవరూ కాదనరు. కాని బుద్ధుని ఆరామాల్ని కూల్చి దిబ్బలు చేసి దానికి ఒక బూతు పదం తగిలించిన హిందూత్వ వాదుల్ని ఏమీ చేయలేకపోయారు. అంతే కాదు ఆనాడు బుద్ధుడు వాడిన పదాలు వల్లె వేస్తే యిపుడు ఎవరికి అర్థం అవుతుంది బావ. తాను ప్రాచీన కవిత్వం రాయ గల్గినా ప్రజల భాషలోకి అడుగు పెట్టాడు శ్రీశ్రీ. బుద్ధిస్టులు కూడ ప్రజలకు అర్థమయ్యే భాషగా మార్చారు. నిజమే బావ అక్కడే మార్క్సు అవసరం కన్పిస్తుంది. మార్క్సు వాదులు సాయుధులుగా మారి ఆయుధం పడితేనే కదా నిజాం పాలన అంతమైంది. అందుకే బావ బుద్ధిజానికి, హ్యూమనిజానికి కమ్యూనిస్టులు వ్యతిరేకం కాదు. నరరూప రాక్షసులు రాజ్యమేలే రోజుల్లో జరిగే ఆర్థిక దోపిడీని అరికట్టడానికి ప్రజల్ని అప్రమత్తులను చేసి అవసరమయితే తమను తాము రక్షించుకోవడానికి ఆయుధం పట్టాలేమో.

వ్యాస రచయిత సెల్ 988559394

జనం జీవితాలతో బీజేపీ అంకెలాట

ఎం.కె.ఆర్

మన ఆర్థిక రంగానికి చెందిన వివరాలు కొన్ని ప్రముఖంగా వార్తలకు ఎక్కాయి. రోజువారీ పనులతో తీరిక లేనివారికి అవి ఒక పట్టాన అర్థంగావు. నిత్య జీవితాలతో (పరోక్షంగా) సంబంధం కలిగినవే అయినా నేరుగా జనాన్ని తాకేవి కాదు గనుక అంతగా పట్టించుకోరు. దీన్ని అవకాశంగా తీసుకొని రాజకీయ నేతలు, అందునా అధికారంలో ఉన్నవారు అంకెలతో గారడీలు చేస్తూ జనాలను ఆడుకుంటున్నారు.

బ్రిటన్‌ను వెనక్కు నెట్టి మనదేశం జీడీపీలో ప్రపంచంలో ఐదవ స్థానానికి వచ్చిందని కొంతమంది సంతోషం ప్రకటిస్తున్నారు, మంచిదే. వెనుకటికి ఎవరో మాది 101 అరకల వ్యవసాయం తెలుసా అని మీసాలు మెలేశాడట. మాది అంటున్నావు ఎవరెవరిది అని అడిగితే మా భూస్వామికి వంద, నాటి ఒకటి అన్నాడట. అలాగే మరొకడు మా ఇంటి పక్కనే ముకేష్ అంబానీ ఇల్లు కట్టు కున్నాడు అని చెప్పాడట. ఆ చెప్పిన వాడి ఇల్లు చిరిగిన ప్లాస్టిక్ కవర్లతో కూడిన గుడారం కాగా అంబానీ ఇల్లు 27 అంతస్తులు, మూడు హెలిపాడ్లు కలిగి ఉంది. కరోనాకు ముందు కేవలం పది బిలియన్ డాలర్ల సంపద కలిగిన అదానీ ఇప్పుడు 141 బి.డాలర్లకు చేరాడు. పేదవాడి ప్లాస్టిక్ పాక, వీధుల్లో అడుక్కొనే బిచ్చగాండ్ల రాబడి, అంబానీ ఇల్లు, అదానీ సంపదలు అన్నింటినీ కలిపే దేశ జీడీపీగా పరిగణిస్తారు. దీన్ని నరేంద్ర మోదీ సాధించిన ఘన విజయాల్లో ఒకటిగా కొందరు వర్ణిస్తున్నారు. అంకెలను ఎవరూ తారుమారు చేయలేరు గానీ ఎవరి భాష్యం వారు చెప్పవచ్చు. నాలుగు ఎలా వచ్చిందంటే నాలుగు ఒకట్లను కలిపితే అని, రెండును రెండుతో హెచ్చవేస్తే అని, కాదు కలిపితే అనీ చెప్పవచ్చు. ఏప్రిల్-జూన్ మూడు మాసాల జీడీపీని లెక్కలోకి తీసుకుంటే మన దేశానిది 823 బిలియన్ డాలర్లుండగా బ్రిటన్‌లో 763 బి.డాలర్లని ఐఎంఎఫ్ ప్రకటించింది. అదే సంస్థ జనవరి-మార్చి మాసాల్లో మనది 864, బ్రిటన్‌లో 813 బి.డాలర్లు ఉన్నట్లు కూడా పేర్కొన్నది. అంటే గడచిన మూడు నెలల్లో మన జీడీపీ 41 బి.డాలర్లు తగ్గింది. బ్రిటన్‌తో పోల్చుకొని సంతోషపడాలా మన తీరు తెన్నులను చూసి విచారపడాలా? ఎవరికి వారు నిర్ణయించుకోవాలి.

ఇవన్నీ డాలరు లెక్కల్లో చెబుతున్న అంకెలు. ఈ కాలంలో మన కరెన్సీ, బ్రిటన్ పౌండ్ విలువ కూడా డాలరుతో పోలిస్తే తగ్గింది కనుక రెండు దేశాల జీడీపీ తగ్గినట్లు ఐఎంఎఫ్ పేర్కొన్నది. కనుక ఈ అంకెలను చూపి విరగబాటును ప్రదర్శించాల్సిన అవసరం లేదు. రానున్న రోజుల్లో మన కరెన్సీ విలువ మరింత తగ్గి, బ్రిటన్ పౌండ్ విలువ పెరిగినా లేక తారుమారైనా భౌతిక సంపదలతో నిమిత్తం లేకుండానే విలువలు మారతాయి. ఈ ఏడాది చివరికి బ్రిటన్ జీడీపీ 3.38 లక్షల కోట్ల డాలర్లు, మనది 3.54 లక్షల కోట్ల డాలర్లు ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా. ఈ మాత్రానికే సంబరాలా? అదే ఐఎంఎఫ్, దాని కవల సోదరి ప్రపంచ బ్యాంక్ మనదేశం గురించి చెప్పిన ఇతర అంకెల గురించి ఇలాంటి సంబరాలు చేసుకున్నామా? ఐదో స్థానానికి

చేరినందుకు సంతోష పడితే తలసరి జీడీపీలో మనం 159వ స్థానంలో ఉన్నామని, పక్కనే ఉన్న శ్రీలంక 148లో ఉందని ఎంతమందికి తెలుసు. 2021లో అదే బ్రిటన్ 47,334 డాలర్లుండగా మనది 2,277 డాలర్లు, చైనాలో 12,556 డాలర్లుంది.

కనీసం చైనా స్థాయికి చేరాలంటే ఇప్పుడున్న జీడీపీ ఐదున్నర రెట్లు పెర గాలి. మోదీని తన మంత్రదండంతో పెంచమనండి. కొడుకును కంటానంటే అత్త వద్దంటుందా అనే సామెత తెలిసిందే. మన జీడీపీ తొలి త్రైమాసికంలో రెండంకెల 13.5 శాతం పెరుగుదల ఉన్నా ఏడాది చివరకు అది ఒక అంకెకు పడిపోతుందని రిజర్వు బ్యాంకే చెప్పింది. ఒకవైపు అది 6 లేదా ఆరున్నర శాతం అని కొందరు చెబుతుంటే ఎస్‌బిఐ 6.7 నుంచి 7.7 శాతం వరకు ఉంటుందని అంచనా వేసింది. అప్పుడు విచార ప్రదర్శనలకు దిగుతామా? మన వృద్ధి రేటు చైనా కంటే ఎక్కువగా ఉందని చెబుతున్నారు, ఉండవచ్చు, గతంలో మన కంటే తక్కువ ఉన్న స్థితి నుంచి జీడీపీలో మనల్ని వెనక్కు నెట్టి చైనా ఎలా ముందుకు పోతోందని ఎవరైనా ప్రశ్నిస్తే వారితో మనకు పోలిక ఎందుకని తప్పించుకుంటారు.

జీడీపీ గురించి గొప్పలు చెబుతున్నవారు ఆగస్టు చివరి వారంలో మన విదేశీ మారక ద్రవ్యనిల్వలు రెండేళ్ల నాటి కనిష్ట స్థాయికి ఎందుకు తగ్గినట్లో చెప్పాలి. ఆగస్టు 26తో ముగిసిన వారంలో నిల్వలు 561 బి.డాలర్లకు తగ్గాయి. ఉక్రెయిన్ సంక్షోభం ప్రారంభం తరవాత 27 వారాలకు 21 వారాల్లో తగ్గుదల నమో దైంది. గతేడాది అక్టోబరుతో పోలిస్తే 80 బి.డాలర్లు తగ్గాయి. ఏప్రిల్-జూన్ మాసాల్లో జీడీపీ వృద్ధి రేటు 16.2 శాతం వరకు ఉంటుందని ఆర్‌బీఐ చెప్పగా 13.5శాతం ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది ఇదే కాలంలో 20.1 శాతం నమోదైంది. అంటే పురోగమనంలో ఉన్నట్లా తిరోగమనంలో ఉన్నట్లా? ఇది ఒక అంకెల గారడీ. వచ్చే రోజుల్లో మన జీడీపీ పెరిగి 2027 నాటికి జర్మనీని, 2029 నాటికి జపాన్‌ను వెనక్కు నెట్టి మూడవ స్థానంలోకి వెళ తుందని ఎస్‌బిఐ చెప్పింది. దానికి ఎస్‌బిఐ చెబుతున్న కారణమేంటి? చైనాలో కొత్త పెట్టుబడులు మందగిస్తాయని, ఆ మేరకు మన దేశంలో పెరుగుతాయని చెబుతూ చైనాలో జరుగుతున్నదానిలో ఐదోవంతు ఉత్పత్తిని భారత్‌కు తరలించనున్నట్లు చెప్పిన యాపిల్ కంపెనీ ప్రకటన ఆశా భావానికి దోహదం చేస్తున్నట్లు చెప్పింది. అదే కంపెనీ ఐపాడ్‌ల ఉత్పత్తిని వియ త్నాంకు తరలించనున్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. యాపిల్ కంపెనీ బ్రెజిల్, భారత్‌లో తలపెట్టిన ఉత్పత్తులు స్థానిక అవసరాలకు తప్ప ఎగుమతుల కోసం కాదని ఆగస్టు ఏడవ తేదీన గార్డియన్ పత్రిక రాసింది.

మన దిగుమతులు పెరిగి దానికి అనుగుణంగా ఎగుమతులు లేక వాణిజ్య లోటు పెరుగుతున్నట్లు జీడీపీ ఐదవ స్థానానికి ఎదుగుదల వార్తలతో పాటే ప్రభుత్వం వెల్లడించింది. ఇన్వెంటియా డాట్‌కామ్ విశ్లేషణ ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్-ఆగస్టు నెలల్లో మన ఎగుమతులు 192.59 బి.డాలర్లు కాగా దిగు మతులు 317.81, లోటు 125.22 బి.డాలర్లు. గతేడాది ఇదే నెలల లోటు 53.78 బి.డాలర్లు మాత్రమే. గతేడాది ఆగస్టుతో పోల్చితే లోటు 13.81 నుంచి 28.68 బి.డాలర్లకు పెరిగింది. ఎగుమతులు 0.8 శాతం తగ్గగా దిగుమతులు 31 శాతం పెరిగాయి. ఇది ఆందోళన కలిగించే అంశం. మన జనానికి పని కల్పించే ఎగుమతులు పెరగకుండా మనలను నిరుద్యోగులుగా మార్చే దిగు మతులు పెరుగుతున్నపుడు జీడీపీ పెరుగుదలతో సామాన్యులకు ఒరిగేదేమిటి? జీడీపీలో ఎదిగామని సంతోషించే వారు దీనికేమి చెబుతారు? 2001 నుంచి చైనా నుంచి దిగుమతులు చేసుకుంటున్న కారణంగా 2018 నాటికి అమెరికాలో 40 లక్షల ఉద్యోగాలు పోయినట్లు అంచనా. ఇదే కాలంలో చైనాతో అమెరికా వాణిజ్య లోటు 83 నుంచి 420 బి.డాలర్లకు పెరిగింది. దిగుమతులు పెరిగితే మన పరిస్థితీ ఇంతేకదా!

ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నది తెలిసిందే. సదరు శతకకారుడు ఇప్పుడు బతికి ఉంటే దీన్ని రాజకీయ పార్టీలకు వర్తింపచేసి ఉండేవాడు. కాంగ్రెస్ పాలనా కాలంలో రూపాయి విలువ పతనం గురించి నానా యాగీ చేసిన బీజేపీ పెద్దలు ఇప్పుడు మాత్రం ఎదురుదాడులకు దిగుతున్నారు. మన కరెన్సీ పతనం కాలేదు, డాలరు విలువ పెరిగితే మనమేం చేస్తాం, ఇతర కరెన్సీలతో పోల్చి చూడండి మనది బలపడింది అని చెబుతున్నారు. గతంలో మన్మోహన్ సింగ్ ఏలుబడిలో కూడా జరిగింది అదే కదా! అప్పుడు ఎందుకు విమర్శించినట్లు? మన కరెన్సీ బలపడితే లేదా దిగజారితే తలెత్తే పరిణామాలు ఏమిటన్నదే గీటురాయి.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

ఐ-మెయిల్

స్వేచ్ఛాస్వాతంత్ర్యాలే ప్రజాస్వామ్యానికి పట్టు గొమ్మలు. కొన్ని దేశాల్లో ప్రజాస్వామ్యమున్నా అది మేడిపండు లాంటిదే. ఈ ఆధునిక యుగంలో కూడా కొన్ని దేశాల్లో ఓటు హక్కు అందని ద్రాక్షలా ఉంది. ప్రజలపై అకృత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజా కంటక నిర్ణయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రజలకు జీవించే హక్కు లేదు. మహిళలకు స్వేచ్ఛ లేదు. కొన్ని దేశాల్లో చదువు గగనకుసుమంలా మారింది. ప్రజాస్వామ్యం ప్రజల కోసం ఏర్పడిన వ్యవస్థ. ప్రజా స్వామ్యం మనగలిగితేనే ప్రజలు హాయిగా స్వేచ్ఛగా జీవించగలుగుతారు. ఈ ప్రజాస్వామ్యం మొట్టమెదటి సారిగా పురాతన గ్రీస్ దేశంలో చిగురు తొడిగినట్టు చరిత్ర తెలియజేస్తోంది. గ్రీకు భాషలో "డెమోస్" అనగా ప్రజలు. "క్రాటోస్" అనగా పాలన. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విబేధాలు లేకుండా ప్రపంచం లోని ప్రజలందరూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుని, శాంతి, సహనశీలత, సౌభ్రాతృత్వం వంటి విశాలమైన భావాలతో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో జీవించాలని 2006 సంవత్స రంలో దోహా (ఖతార్) లో జరిగిన అంతర్జాతీయ పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశాల సదస్సు పిలుపిచ్చింది. అంతకుముందు 1997లో కైరో (ఈజిప్టు) లో జరిగిన సదస్సు ప్రజాస్వామ్య పరిధిని విస్తృతం చేయాలని సార్వత్రిక ప్రకటన విడుదల చేసింది. ప్రజాస్వామ్యం ప్రాధాన్యతను చాటి చెప్పి ప్రజలను సంఘటితం చేయ దానికి ఐక్యరాజ్య సమితి నిరంతరం కృషి చేస్తున్నది. ప్రజా స్వామ్యాన్ని కాపాడుతూ, ఇతరుల హక్కులకు భంగం కలి గించని రీతిలో హుందాగా జీవించడమే ప్రజల విద్యుక్త ధర్మం. ప్రజల గొంతును అణచివేయడం ప్రభుత్వాలకు తగదు.

సుంకవల్లి సత్తిరాజు

'లైఫ్‌కేర్'నీ అమ్మేస్తున్నారు

ఆళ వందార్ వేణు మాధవ్

బీజేపీ ప్రభుత్వం దేన్నీ వదిలిపెట్టడం లేదు. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ప్రభుత్వ రంగ సంస్థనీ అమ్మేస్తోంది. ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థ హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్‌నీ ఇప్పుడు ఇదే బాట పట్టించింది. కేరళ రాజధాని తిరువనంతపురం కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ గర్భనిరోధక మాత్రలు, కండో మ్స్‌తో పాటు ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాలు, ఇతర ఫార్మా ఉత్పత్తులను, ఆయుర్వేద మందులను, రక్త నిల్వలను కూడా అందిస్తుంది. కొన్ని దశాబ్దాలుగా సరసమైన ధరలకు ఈ వైద్య ఉత్పత్తులన్నింటినీ అందిస్తున్న సంస్థను కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరి స్తోంది. హెచ్‌ఎల్‌ఎల్ లాభదాయకమైన మినీరత్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. ఇది ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంక్షేమ కార్యకలాపాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. గర్భనిరోధకాల తయారీకి సాంకేతికతను అభివృద్ధి చేసింది, వాటితో పాటు ఇతర ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా పంపిణీ చేయడానికి అవుట్‌లెట్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. హెచ్‌ఎల్‌ఎల్ నికర విలువ రూ.300 కోట్లు. ఇది 2020-21 ఆర్థిక సంవత్స రంలో రూ.112.33 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది, కోవిడ్ ప్రేరిత మందగమనం ఉన్నప్పటికీ, అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో (రూ.110.48 కోట్లు) పోలిస్తే స్వల్ప పెరుగుదల నమోదు చేసింది. హెచ్‌ఎల్‌ఎల్ సంవత్సరాలుగా పరిశోధన, అభివృద్ధిలో భారీ పెట్టు బడులు పెట్టింది. మూడు అంతర్జాతీయ పేటెంట్లను పొందింది. మరో ఎనిమిదింటిని పొందేందుకు వరుసలో ఉంది. ఇన్ని విజయాలు ఉన్నప్పటికీ, క్రియాశీల కంగా పనిచేస్తున్నప్ప టికీ ప్రభుత్వం హెచ్‌ఎల్ ఎల్‌ను అమ్మేసేందుకు సిద్ధం కావడం ఆందోళన కరం.

దీని ప్రైవేటీకరణకు 2017-18లోనే ఆమోదం తెలిపిన ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ఈ చర్యల్లో వేగం పెంచింది. ప్రపంచవ్యాప్తంగా కొనుగోలు దారులను ఆహ్వానించింది. హెచ్‌ఎల్‌ఎల్ ఉత్పత్తి యూనిట్లలో నాలుగింటికి భూమిని అందించిన కేరళ ప్రభుత్వం హెచ్‌ఎల్‌ఎల్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని లేదా గ్లోబల్ బిడ్‌లోకి ప్రవేశించడానికి రాష్ట్ర ప్రభుత్వాన్ని అనుమతించా లని కేంద్రాన్ని కోరింది. ఇప్పుడు ఉన్న నిబంధనల ప్రకారం బిడ్డర్లు తర్వాత ఫార్మా/హెల్త్‌కేర్ ఉత్పత్తి తయారీ వ్యాపారంలో ఉండాల్సిన అవసరం లేదు. అందువల్ల ప్రైవేటీకరణ తర్వాత హెచ్‌ఎల్‌ఎల్ దాని సేవలను కొనసాగిస్తుందా లేదా అనేది తెలీదు. ప్రస్తుతం ఇందులో పనిచేస్తున్న వెయ్యి మందికి పైగా ఉద్యోగులకు వారి కొలువులు ఉంటాయన్న గ్యారంటీ లేదు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లలో హెచ్‌ఎల్‌ఎల్ ఫ్యాక్టరీలతో పాటు కేరళ, మహారాష్ట్ర, గోవా, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ అంతటా ఉన్న 10 లీజు ఆస్తులనూ అమ్మకానికి పెట్టారు. వైద్యాన్ని అందరికీ అందు బాటులో ఉంచాల్సిన ప్రభుత్వమే ఇలాంటి పనులకు పూను కోవడం అత్యంత విచారకరమైన విషయం. హెచ్‌ఎల్‌ఎల్‌ను ప్రైవేటీ కరిస్తే లాభార్జనే ధ్యేయమవుతుందన్నది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీంతో

లక్షలాది మంది ప్రజలు అందుబాటు ధరలో ఉన్న అవసర మైన మందులను కోల్పోతారు. వీటికోసం చెల్లించాల్సిన వ్యయం భారీగా పెరుగుతుంది.హెచ్‌ఎల్‌ఎల్ ప్రైవేటీకరణను హెచ్‌ఎల్‌ఎల్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ మండలి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రైవేటీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే 2017-18లోనే నిర వధిక సమ్మె చేపట్టిన ఈ మండలి అనేక సార్లు నిరసన వ్యక్తం చేసింది. భారీ ర్యాలీలతో స్థానికుల నుండి మద్దతును సంపాదించింది. కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది ఈ ఏడాది మే నెలలో అక్కుళంలోని హెచ్‌ఎల్‌ఎల్ ప్లాంట్ నుండి ఉల్లూరు వరకు మానవ హారం నిర్వహించారు. హెచ్‌ఎల్‌ఎల్ ప్రైవేటీ కరణను కార్మికులే కాదు జనం కూడా వ్యతిరేకిస్తు న్నారు. ఈ ప్రైవేటీకరణ ప్రక్రియ దేశంలో ప్రజా రోగ్యాన్ని మరింత క్షీణింప జేస్తుంది. హెచ్‌ఎల్‌ఎల్‌ను ప్రజల సొమ్ముతో ప్రజా రోగ్యం కోసం ఏర్పాటు చేశారు. ప్రైవేటు లాభార్జన కోసం దాన్ని అమ్మడం నేరం!. దీని వలన ఆరోగ్య ఖర్చులు విపరీతంగా పెరిగి ప్రజలు మరింతగా పేదరికంలో కూరుకుపోతారు. కేంద్రప్రభుత్వం సాగిస్తున్న ఈ దుందుడుకు చర్యలను మరింత గట్టిగా, మరింత సమష్టిగా నిరసించాల్సిన అవసరం ఉంది.

వ్యాస రచయిత సెల్ 8686051752.



నిరుపయోగంగా ఉండే యంత్రాలు పెట్టుబడి కిందకు రావు.

-కార్ల్ మార్క్స్



సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14 - 18, 2022
విజయవాడ

మెలి తిరిగిన స్ప్రాట్ జీవనయానం

ఫిలిప్ స్ప్రాట్ (1902-1971) బ్రిటన్ కు చెందిన రచయిత, మేధావి. భారత్‌లో కమ్యూనిజం వ్యాపింప చేయడంకోసం 1926లో వచ్చారు. ఆ రకంగా కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరయ్యారు. మాస్కోలోని కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ (కొమిటర్న్) ఆయనను భారత్ కు పంపించింది. ఆయన మెక్సికోలోనూ, భారత్ లోనూ కమ్యూనిస్టు పార్టీ నెలకొనడంలో పాత్ర పోషించిన ఎం.ఎన్.రాయ్ తో స్నేహం కుదుర్చుకున్నారు. స్ప్రాట్ మన దేశంలో క్రియాశీల కమ్యూనిస్టు అయ్యారు. కమ్యూనిస్టు పార్టీ తొలి తరం నిర్మాతల్లో ఆయనా ఒకరు. మీరట్ కుట్ర కేసులో ప్రధాన నిందితుడు. 1929 మార్చి 20న ఆయన ఈ కుట్ర కేసులో అరెస్టయ్యారు.

ఆయన జైలులో ఉండగా చదివిన గ్రంథాల ప్రభావంవల్ల, రష్యా, యూరప్ లో పరిణామాలవల్ల కమ్యూనిజం మీద ఆయనకు విముఖత కలిగింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ అనుసరించిన వామపక్ష విధానాలను ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆయనకు 17 ఏళ్లు వచ్చేటప్పటికే 19వ శతాబ్దంలోని భౌతిక శాస్త్ర పరిణామాలు ఆకళింపు చేసుకున్నారు. చర్చికి వెళ్లిన తరవాత సాయంత్రాలు సైన్సు, మతం గురించి తనలో తానే వితర్కించుకునే వారు. మతం చెప్పే సిద్ధాంతాలలోని డొల్లతనాన్ని పసిగట్టారు. అయితే ఆ విషయం బయటికి చెప్పకుండా చర్చీకి వెళ్లడం మాత్రం కొనసాగించారు. విశ్వవిద్యాలయానికి వెళ్లే దాకా ఇదే పద్ధతి కొనసాగింది.

ఆయనకు 24 ఏళ్లు ఉన్నప్పుడు రజనీ పామీ దత్ అన్నయ్య క్లెమెన్స్ దత్ ఆయనను భారత్ వెళ్లి కమ్యూనిస్టు పార్టీకోసం కృషి చేయాలని ఆదేశించారు. కమ్యూనిస్టులు చట్టబద్ధంగా పని చేయడం కోసం పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ ఏర్పాటులో స్ప్రాట్ పాత్ర ఉంది. కమ్యూనిస్టులు బహిరంగంగా పని చేయడానికి అవకాశం లేని సమయంలో వారిని కాంగ్రెస్‌లో చేర్పించడంలోనూ ఆయన కృషి ఉంది. అలా కమ్యూనిస్టులు కార్మిక సంఘాల్లోనూ, యువజన సంస్థల్లోనూ నాయకత్వ స్థానాల్లోకి వచ్చారు.

ఉత్తర ప్రత్యుత్తరాల ఆధారంగా 1927లో స్ప్రాట్ ను అరెస్టు చేసి విచారణ జరిపించారు. భారత్ చైనా మీద గ్రంథం రాసినందుకు ఆయన మీద దేశద్రోహ కేసు మోపారు. ఆయనను నిర్బంధించడంపై బ్రిటిష్ పార్లమెంటులో తీవ్రమైన చర్చ జరిగింది. బ్రిటిష్ పార్లమెంటులో కమ్యూనిస్టు సభ్యుడైన షాపూర్జీ సక్లత్ వాలా ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఫిలిప్ స్ప్రాట్

స్ప్రాట్ ఆ తరవాత బొంబాయి, కలకత్తా లాంటి చోట వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీని విస్తరించడానికి కృషి చేశారు. దీనితో ఆయన నాయకత్వ స్థానానికి ఎదిగారు. ఈ కారణంగా 1927-30 మధ్య శక్తివంతమైన ప్రజా సంఘాలు రూపుదిదుకున్నాయి. కమ్యూనిస్టులు, చైనా గురించి పత్రికల్లో విరివిగా రాసే వారు. "ఒక అంతర్జాతీయవాది" అన్న పేరుతో స్ప్రాట్ చాలా వ్యాసాలు రాశారు. ఆ వ్యాసాలు తరవాత పుస్తకంగా వెలువడ్డాయి. షాపూర్జీ సక్లత్ వాలా దానికి పీఠిక రాశారు. ఈ గ్రంథాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ కార్యాలయాల మీద దాడులు జరిగాయి. 1927 సెప్టెంబర్ 6న బొంబాయిలో స్ప్రాట్ ఉంటున్న వై.ఎం.సి.ఎ. హాస్టల్ మీద దాడి చేసినప్పుడు ఆయన దగ్గర రాత ప్రతులు దొరికాయి. స్ప్రాట్ ను, మిరాజ్ కర్ ను "క్రాంతి" పత్రిక ఆఫీసులో దేశ ద్రోహ ఆరోపణ కింద అరెస్టు చేశారు. స్ప్రాట్ రెండు నెలలకు పైగా ఆర్థర్ రోడ్ జైలులో ఉండవలసి వచ్చింది. చివరకు ఈ కేసు రుజువు కానే లేదు.

ఎ.ఐ.టి.యు.సి. కార్యకలాపాల్లోనూ స్ప్రాట్ క్రియాశీలంగా పాల్గొనేవారు. బొంబాయిలోని అపోలో, మాంచెస్టర్ మిల్లుల దగ్గర జరిగిన నిరసన ప్రదర్శనల్లో మిరాజ్కర్, కె.ఎన్.జోగ్లేకర్ లాంటి వారితో కలిసి స్ప్రాట్ కూడా పాల్గొన్నారు. 1928లో కలకత్తాలో వీధులూడ్చే వారి రెండు సమ్మెల్లోనూ స్ప్రాట్ క్రియాశీలంగానే ఉన్నారు. శాసనోల్లంఘనోద్యమలో భాగంగా 1934లో స్ప్రాట్ మళ్లీ 18 నెలలు జైలు శిక్ష అనుభవించవలసి వచ్చింది. 1936లో విడుదలయ్యారు. మీరట్ కుట్ర కేసులో జైలులో ఉన్నప్పుడు స్ప్రాట్ హిందీ నేర్చుకుని మహాత్మా గాంధీ ఆత్మకథ చదివారు. ఆ తరవాత బెల్గాం లో ఉన్నప్పుడు గాంధీ తత్వం:ఒక విశ్లేషణ అన్న పుస్తకం రాశారు. 1934 అక్టోబర్ 21న బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సోషలిస్టు మహాసభలో పాల్గొన్నారు.

1934లో స్ప్రాట్ కు దక్షిణ భారత దేశంలో తొలి కమ్యూనిస్టు సింగారవేలు చెట్టియార్ తో పరిచయం అయింది. ఆయన బంధువు సీతతో ప్రేమలో పడి 1939లో పెళ్లి చేసుకున్నారు. 1939లో సోవియట్ యూనియన్ ఫిన్లాండ్ మీద దాడి చేసినప్పుడు సోవియట్ విధానాన్ని స్ప్రాట్ విమర్శించారు. అప్పుడే ఎన్.ఎన్.రాయ్ నాయకత్వంలోని రాడికల్ డెమొక్రాటిక్ పార్టీలో చేరిపోయారు. తరవాత బెంగలూరులో స్థిరపడి అమెరికా అనుకూల, పెట్టుబడిదారీ అనుకూల "మైస్ ఇండియా" పత్రిక సంపాదకులయ్యారు. మళ్లీ మద్రాసు వెళ్లి చక్రవర్తుల రాజగోపాలా చారి నాయకత్వంలోని స్వతంత్ర పార్టీ అధికార పత్రిక స్వరాజ్య సంపాదకులయ్యారు. దానితో స్ప్రాట్ కమ్యూనిస్టు వ్యతిరేక ఆవృతం పూర్తి అయింది. ఆ సమయంలోనే స్ప్రాట్ అనేక అంశాల మీద గ్రంథాలు రాయడంతో పాటు ఫ్రెంచ్, జర్మన్, తమిళం, సంస్కృతం, హిందీ నుంచి అనేక గ్రంథాలు అనువదించారు.

- ఆర్వీ

ఉక్కు ఉద్యమ నేత చిట్టూరి

చిట్టూరి ప్రభాకర చౌదరి (1925-2021) కాంగ్రెస్ కుటుంబం నుంచి వచ్చిన వారు. ఆయన తండ్రి కాంగ్రెస్ అభిమాని. వాళ్లింట్లో భగత్ సింగ్, గాంధీ, నెహ్రూ ఫొటోలు ఉండేవి. భగత్ సింగ్ మరణించే నాటికి చిట్టూరికు పదేళ్లయినా లేవు. ఆ రోజు వాళ్లింట్లో వంటే వండలేదు. ప్రభాకర చౌదరి బాలుడు కనక హెూటల్‌కు తీసుకెళ్లి టిఫిన్ పెట్టించారట. 1952 లో మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు ఆయన రాజమండ్రి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా గెలుపొందారు. మళ్లీ 1957, 1967, 1972 లో కూడా శాసన సభకు ఎన్నికయ్యారు. 1955 మధ్యంతర ఎన్నికలలో మాత్రం బూరుగుపూడి నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

విద్యార్థి ఉద్యమంద్వారా ఆయన కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చారు. 1962 నుంచి 1966 దాకా జరిగిన విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు ఉద్యమంలో ఆయన క్రియాశీలంగా పాల్గొన్నారు. రాజకీయ పాఠశాలకు వెళ్లి వచ్చిన బొడ్డు బుచ్చిరాజు ద్వారా సోషలిస్టు సిద్ధాంతం, రష్యా గురించి తెలుసుకున్నారు. ప్రభాకర చౌదరి నాన్న జై ప్రకాశ్ నారాయణ్ రాసిన "సోషలిజం ఎందుకు?" పుస్తకం చదువుతుండగా అది ప్రభాకర చౌదరి కూడా చదివి ప్రభావితులయ్యారు. మన్యం విప్లవం, అల్లూరి సీతారామరాజు చరిత్ర కూడా ఆయనలో ప్రగతిశీల భావాలు అంకురించడానికి తోడ్పడ్డాయి. మాలపిల్ల సినిమా ఆయనలో ఆలోచనలు రేకెత్తించింది. అంతకు ముందు అభిమానించిన స్వామీ వివేకానంద ఆధ్యాత్మిక భావాల నుంచి బయటపడ్డారు.

కార్మిక సంఘాలు ఏర్పాటు చేయించడానికి ఆయన విశేషమైన కృషి చేశారు. సంఘాలు పెటుకోవాలని కార్మికులను కోరేవారు. కొన్ని సార్లు ఛీత్కారాలూ భరించవలసి వచ్చింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ఉన్న వారితో పరిచయం పెంచుకున్నారు. 1941 లో మునిసిపల్ కార్మిక సంఘం నెలకొల్పారు. ఇంటర్మీడియట్ తరవాత చదువు మానేసి పూర్తి కాలం రాజకీయాలలో నిమగ్నమయ్యారు. బతుకు గడవడం కోసం తన సైకిల్ పది రూపాయలకు అమ్మేసి సొంత కాళ్ల మీద నిలబడి జీవించాలనుకున్నారు. ఆ పదీ ఒక మిత్రుడు కాజేశాడు. షాదీరా అనే మిత్రుడు హాస్టల్‌లో మిగిలిన భోజనం ఇస్తే దానితో కాలం గడిపారు.

చిట్టూరి ప్రభాకర చౌదరి

ప్రభాకర చౌదరి ఏర్పాటు చేసిన జట్టు కార్మిక, ఇతర సంఘాల వారు నెలకు ఒకసారి రోజు కూలీ పార్టీకి విరాళంగా ఇచ్చేవారు. జట్టు కార్మిక సంఘంలో ఒక వ్యక్తి మునిసిపల్, శాసనసభ, పార్లమెంటు ఎన్నికలు వచ్చినప్పుడు పూర్తిగా పార్టీ కార్యక్రమాల్లో మునిగిపోయేవాడు. అప్పుడు వారి కుటుంబం గడవడానికి సంఘం తరఫున జీతం మొత్తం ఆ కార్మికుడి ఇంటికి పంపేవారు.

రాత్రి పాఠశాలలు నడిపి విద్యగరపడం, రేషన్ కార్డులు ఇప్పించడం, రోగులకు చికిత్స చేయించడం, వ్యాయామశాలలో కసరత్తు చేయడం మొదలైన వాటిని ప్రభాకర చౌదరి ప్రోత్సహించే వారు. కార్మిక సంఘాల్లో ప్రజాస్వామ్య విధానం ఉండాలని, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించాలని ఆయన దృఢంగా భావించేవారు. సహకార ఉద్యమాన్ని ప్రోత్సహించడం కూడా పార్టీని బలోపేతం చేయడానికి ఉపకరిస్తుందని ప్రభాకర చౌదరి భావించే వారు. 99 ఏళ్ల వయసులో 2021 లో మరణించారు. దాదాపు ఎనిమిది దశాబ్దాలు ఆయన సీపీఐలో చురుకుగా పాల్గొన్నారు.

-భరద్వాజ

మీరట్ కుట్రకేసులో జైలుకెళ్లిన కమ్యూనిస్టు నాయకులు

కమ్యూనిస్టు వ్యాప్తికి తోడ్పడిన కేసు

కార్మికుల సమ్మెలు ఇతర మిలిటెంటు ఉద్యమాల ద్వారా బ్రిటీషు ఇండియా ప్రభుత్వాన్ని కూల్చటానికి కుట్ర పన్నారనే ఆరోపణలతో అలనాటి ప్రముఖ ట్రేడ్ యూనియన్, కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్స్ ముజఫర్ అహ్మద్, ఎస్.ఎ.డాంగే, ఘాటే, డా॥అధికారి, పి.సి.జోషి, శకుల్ ఉస్తానియా, మిరాజ్‌కర్, బ్రిటీషు కామ్రేడ్స్ ఫిలిప్ స్ప్రాట్ తదితరులపై మన దేశ శిక్షాస్మృతి 121 నుపయోగించి మీరట్ కుట్ర నేరం మోపారు. ఈ కేసులో భాగంగా 1929 అక్టోబరు 15 నుండి 20 వ తేదీ మధ్యలో 31 మంది కమ్యూనిస్టు కార్యకర్తలను అరెస్టు చేశారు. అక్టోబరు విప్లవం విజయం తర్వాత వలస దేశాల్లో సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉవ్వెత్తున ఉద్యమాలు ఎగిసిపడటంతో భయభ్రాంతులైన బ్రిటీషు ప్రభుత్వం ఈ ఉద్యమాలను అణచటానికి ఒడిగట్టింది. అందులో భాగంగానే ఆనాటి ప్రముఖ కార్మిక, కమ్యూనిస్టు నేతలపై మీరట్ కుట్ర కేసు మోపారు.



అఖిల భారత ట్రేడ్ యూనియన్ సమాఖ్య (ఎ.ఐ.టి.యు.సి) 1920 వ సంవత్సరంలో స్థాపించిన తర్వాత కార్మిక వర్గ పోరాటాలు ఊపు అందుకున్నాయి. ఫ్యాక్టరీల్లో విద్యుత్ దీపాల ఏర్పాటుతో పని గంటలను రోజుకి 15 గంటలకు పొడిగించిన పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా 1908 లో బొంబాయి నగరంలో కార్మికులు బాలగంగాధర్ తిలక్ నాయకత్వాన సమ్మె చేశారు. బొంబాయి నగరంలో 22 సంవత్సరాల డాంగే, మద్రాసు నగరంలో జాలరి సామాజిక వర్గం నుంచి స్వయంగా కార్మిక నేతగా ఎదిగిన కామ్రేడ్ అనంత శయనం, కాన్పూరులో ముజఫర్ అహ్మద్ వివిధ కార్మికోద్యమాలకు సారథ్యం వహించారు. కేవలం 1920 నుంచి 30 వరకు భారత్ ఉపఖండంలో కార్మిక వర్గం దాదాపు నాలుగు వేల సమ్మెలు నిర్వహించింది.

1929 నుండి 33 వరకు సుదీర్ఘంగా సాగిన కేసు విచారణను వేదికగా తీసుకొని నిందితులు, దేశంలోని కార్మికుల డిమాండ్లను, పెట్టుబడాదారుల ప్రభుత్వ దమనకాండను, వలస దేశాల్లో బ్రిటీషు సామ్రాజ్యవాద దోపిడీని సవివరంగా ఎండగట్టేవారు. విచారణ సమయంలో తమ నాయకులకు సంఘీభావంగా వందల సంఖ్యలో కార్మికులు, సామాన్యులు కోర్టు వద్ద గుమిగూడే వారంటే ఆశ్చర్యం కలగక మానదు. విచారణ సమయంలో నాయకులు చేసిన ప్రసంగాలను దేశ, విదేశాల్లోని వివిధ ప్రముఖ పత్రికలు ప్రచురించేవి. నాయకులు చేసిన ప్రసంగాలు దేశ స్వాతంత్ర్యానికి, కార్మిక వర్గం, ప్రజలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేయవల్సిన పోరాటాల ఆవశ్యకతను నొక్కి చెప్పాయి. ఈ సందేశాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లటంలో కోర్టు విచారణ వేదిక ఎంతగానో తోడ్పడింది. ఫలితంగా 1930 నుండి 40 సంవత్సరాల మధ్య రైతు, మహిళ, విద్యార్థి, యువజన తదితర సంఘాల స్థాపనకు, కమ్యూనిస్టు పార్టీ దేశ వ్యాపిత నిర్మాణానికి ఎంతగానో తోడ్పడింది. దేశంలోని కమ్యూనిస్టు ఉద్యమాన్ని అంతమొందించాలనే కుతంత్రంతో మోపిన ఈ కేసు ఎదురు తిరిగి దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టుల పలుకుబడి పెరగటానికి దోహదపడటంతో బ్రిటీషు పాలకులు నివ్వెరపోయారు.

మీరట్ సెషన్సు కోర్టు విచారణాంతరం 27 మందికి శిక్షలు విధించింది. కామ్రేడ్ ముజఫర్ అహ్మద్‌కు జీవిత ఖైదు, డాంగే, స్ప్రాట్‌ఎస్‌విఘాటె జోగేల్కర్ తదితరులకు 12 ఏళ్లు కోర్టు కారాగార శిక్ష విధించింది. కానీ కార్మిక నేతలకు సంఘీభావంగా దేశ వ్యాపితంగా జరిగిన నిరసనలకు తలొగ్గి ఈ శిక్ష మూడు సంవత్సరాలకు కుదించారు. మరో విశేషమేమిటంటే మీరట్ కేసు విచారణ లండన్ దిన పత్రికల్లో ప్రముఖంగా ప్రచురితమవటంతో నిందితులకు సంఘీభావంగా బ్రిటన్ వ్యాప్తంగా ట్రేడ్ యూనియన్లు, కమ్యూనిస్టులు అనేక ప్రదర్శనలు నిర్వహించాయి. "రెడ్ మెగాఫోన్లు" (ఎర్ర బాకాలు) అనే ప్రజా సాంస్కృతిక సంస్థ నిర్వహించిన "మీరట్88 వీధి నాటకం ఆ రోజుల్లో ఇంగ్లండు వ్యాప్తంగా ప్రజల మన్ననలను పొంది, ప్రజల సంఘీభావాన్ని కూడగట్టగలిగింది.

- సోము

ప్రజల సహకారం మరువలేనిది

1961 వ సంవత్సరం ఉమ్మడి పార్టీ 6 వ మహాసభ విజయవాడలో జరిగింది. సోవియట్ రష్యా పార్టీ నాయకులు సుస్లోవ్ సౌహార్ద్ర ప్రతినిధిగా పాల్గొన్నారు. అప్పుడు వేసిన విశాలాంధ్ర ప్రత్యేక సంచిక ఇప్పటికి నా వద్ద ఉంది. అప్పుడు నా వయసు 10 ఏళ్లే. విశాఖపట్నంలో 13 వ రాష్ట్ర పార్టీ మహాసభలు 1974 నవంబరు 27 డిసెంబరు 1 వరకు జరిగాయి. నేను ప్రతినిధిగా పాల్గొన్నాను. రాష్ట్ర మహాసభలో 10 వ జాతీయ మహాసభకు ప్రతినిధిగా ఎన్నికయ్యాను. నా వయసు అప్పుడు 23 ఏళ్లు. నేటి రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టులు ఒక్కటి కావాలి.

కొమ్మన నాగేశ్వరరావు

విజయవాడ మున్సిపల్ స్టేడియంలో 10 వ మహాసభ జరిగింది. ఆహ్వాన సంఘం అధ్యక్షునిగా తమ్మారెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా దాసరి నాగభూషణరావు, కోశాధికారిగా వై.వి.కృష్ణారావులు వ్యవహరించారు. వంటశాల బాధ్యులుగా జె.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి, నాగళ్ల రామకృష్ణయ్య ఉన్నారు. మహాసభకు అనేక దేశాల నుండి సౌహార్ద్ర ప్రతినిధులు, దేశం అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధులు వచ్చారు. విదేశీ ప్రతినిధులకు గుంటూరు పొగాకు కంపెనీల అతిథి గృహంలో బస ఏర్పాటు చేశారు. కంపెనీల వారే రానుపోను కార్లు ఏర్పాటు చేశారు.

ఇప్పటిలా ఆ రోజుల్లో ఫంక్షన్ హాల్స్ లేవు. స్టేడియంలోనే పెద్ద ఎత్తున షామియానాలు వేసి మీటింగ్ హాలు, వేదిక, వసతి ఏర్పాట్లు చేశారు. ప్రతి ప్రతినిధికి ఒక నులక మంచం ఏర్పాటు చేశారు. ఉత్తరాది, దక్షిణాది వంటకాలు విడివిడిగా చేశారు. ప్రతినిధులకు గోల్డ్‌స్పాట్ డ్రింకులు కంపెనీ వారు ఇచ్చారు. కారుమూరి దేవసుందరరావు, నేను పక్కపక్కనే నులక మంచాలపై రాత్రి నిద్రపోయే వాళ్లం.

మహాసభకు నాలుగు మాసాలు ముందు నుండీ విస్తృత ప్రచారం జరిగింది. జనసేవాదళ్ శిక్షణకై క్యాంపులు 15 రోజుల పాటు రాష్ట్రంలో 10 వేల మందికి శిక్షణ ఇచ్చారు. ప్రదర్శనలో జనసేవాదళ్ కవాతు గొప్ప ఆకర్షణ. ప్రదర్శకులపై విజయవాడలో అడుగడుగున పూల వర్షం కురిసింది.

ఆనాడు ప్రజల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలు ఉదారంగా లక్షలాది రూపాయలు విరాళాలు ఇచ్చారు. యావత్ పార్టీ అన్ని స్థాయిలలో కదలి పని చేసింది. విజయవాడలో నీలం రాజశేఖరరెడ్డి, తమ్మారెడ్డి సత్యనారాయణ, దాసరి నాగభూషణరావులతో సహా వందలాది మంది కార్యకర్తలు దళాలుగా ఏర్పడి విరాళాలు వసూలు చేశారు. దాసరి కృష్ణాజిల్లాలో గ్రామగ్రామాన తిరిగి నిధులు, ప్రజా సమీకరణకు కృషి చేశారు. మహాసభ ప్రారంభంలో వెలిగించిన జ్యోతిని మాలెంపాటి బాల భాస్కరరావు కుమారుడు అజాద్ దివి తాలూకా అమర వీరుల స్థూపం నుండి వందలాది మోటారు సైకిళ్లతో కాలి నడకన తీసుకురాగా జ్యోతి ప్రజ్వలన జరిగింది. కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు జరీపంచె, మెడలో కండువాతో ఆజాను బాహుడిగా ఉండి మహాసభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కామ్రేడ్స్ డాంగే, పి.సి.జోషి, భూపేష్‌గుప్తా, అచ్యుత్‌మీనన్, ఇంద్రజిత్‌గుప్తా వంటి అగ్రనేతలను దగ్గరగా చూసే అదృష్టం కలిగింది.

బహిరంగ సభకు లక్షలాది మంది ప్రజలు వచ్చారు.నూజివీడు ప్రాంతం నుండి 30 లారీలు, ఇతర వాహనాల ద్వారా వేలాది మంది తరలి చ్చారు. నాటి ప్రదర్శన, బహిరంగ సభ ఆంధ్రరాష్ట్ర చరిత్రలో 'నభూతో నభవిష్యతీ' అన్నట్లు జరిగింది. కామ్రేడ్ దాసరి అన్నీ తానై ఏర్పాట్లు పర్యవేక్షించారు. కలకత్తా, దిల్లీ మహాసభలకు కూడ నేను ప్రతినిధిగా పాల్గొన్నాను. విజయవాడ మహాసభ దానికదే సాటి. 24 వ మహాసభ కమ్యూనిస్టు ఐక్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి. భారత కమ్యూనిస్టులు ఏకం కావాలి. ఇది తక్షణ కర్తవ్యం కావాలి.

-కొమ్మన నాగేశ్వరరావు







బాల్యపు మనసులో ఎన్ని ప్రశ్నలో..??

నా దేశం ఇంకా అర్ధరాత్రి నిద్రపోతుంది
బాల్యపు మొగ్గల్లో విజ్ఞాన రేఖలు గీయకుండా
పుస్తకాల మోతల్లో భవితవ్యము ఉంటే
సుత్తి పట్టిన చెయ్యి తలరాత మారేది ఎట్లు..

అసమానత్వపు కలికాలంలో ఇదే నిదర్శనం
అమ్మ ఒడిలోని బాల్యం కార్మిక శక్తిగా నిలిచే
ఎర్రబడ్డ చేతుల్లో భవిత గీతలు మాయమయ్యే
చిట్లిన రక్తపు మరకలు కాలపు గాయంగా మిగిలే..

పలక బల్పము పట్టాల్సిన అమృత హస్తం
కోటి ఆశలు వదులుకున్న కన్నీళ్ళ వర్షమే కురిసే
దేశపు ఆశాజ్యోతి కొలిమి మంటల్లో తడిసుంటే
ఊపిరితిత్తుల్లో గాలి వింజామరై విసురుతోంది..

తనువు పై పడ్డ చెమట బిందువు నవ్వుతుంటే
తుడిచే వస్త్రం ఏ పెత్తందారు చేతుల్లో ఉంటుందో
ఉప్పు పట్టిన శరీరముపై చారలు చూస్తుంటే
చిరు మనసులో సవా లక్ష ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

ఆకలి కడుపులో విద్యకు స్థానం లేదా
అభాగ్యుల జీవితాల్లో వెలుగులు లేవా??
చదవాల్సిన బాల్యం బానిసత్వానికి గురైతే
దేశ తలరాతను మార్చే మేధావులు ఎక్కడా..??

అభివృద్ధి కాగితాలకే పరిమితమవుతుంది
బాల్యపు మనసులో చదువు దూరమవుతుంది
అర్ధాకలి జీవితాలు ఎండకు నీడకు బలి అవుతుంటే
పిడికెడు మెతుకులకు కన్నీళ్లు కార్చుకుంది లోకం..

సూర్యుని నీడల్లా వెలగాల్సిన పసి బాల్యం
అమావాస్య చంద్రునిలా తయారవుతుంది
చెయ్యి పట్టి నడిపించే రక్త బంధం ఏడుస్తుంటే
తాను ఒక రక్తపు చుక్కై ఇంటికి తోడు నిలుస్తుంది..

తారాజువ్వలా వెలుగుతున్న నా దేశంలో
అంతే స్థాయిలో దరిద్రం నిత్యం తాండవం చేస్తుంది
నాలుగు వేళ్ళు నోట్లోకి పోని అభాగ్యులు ఇంకా ఉంటే
అభివృద్ధి చెందుతూనే ఉంటుంది ఇంకా నా దేశం..

- కొప్పుల ప్రసాద్, నంద్యాల

రేపు 'విట్' స్నాతకోత్సవం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ద్వితీయ స్నాతకోత్సవం ఈ నెల 24వ తేదీ జరుగుతుందని వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ సి.ముదిగంటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలోని టంగుటూరి ప్రకాశం ఆడిటోరియంలో శనివారం ఉదయం 10 గంటలకు స్నాతకోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుంది. విట్ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత ప్రభుత్వ రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డి, గౌరవ అతిథులుగా బెంగళూరు బైజూస్ అధినేత సుమన్ రుద్ర, కాగ్నిజెంట్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ పాకాల, వీఐటీ వైస్ ప్రెసిడెంట్‌లు డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, జీవీ సెల్వం పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. యూనివర్శిటీ అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనవల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

పే సీఎం ప్రచారం కేసులో
కాంగ్రెస్ కీలక నేత అరెస్టు

బెంగళూరు: ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 40 శాతం కమీషన్ పేరుతో కర్ణాటక సీఎం బసవరాజ్ బొమ్మైని టార్గెట్ చేస్తూ ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేత, ఆ పార్టీ సోషల్ మీడియా మాజీ చీఫ్ బీఆర్ నాయుడును బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అర్థరాత్రి నాయుడును అక్రమంగా పోలీసులు అరెస్టు చేశారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ గురువారం నగరంలోని హైగ్రౌండ్స్‌లోని పోలీసు స్టేషన్‌కు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. స్టేషన్ సమీపంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పోలీసుల చర్యపై మండిపడ్డారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అధికారికంగానే పే సీఎం అంటూ ప్రచార ఆందోళన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. శుక్రవారం తమ పార్టీ ఎమ్మెల్యేలు అందరూ పే సీఎం పోస్టర్లను అతికించే కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

రైతులకు మద్దతుగా ఎడ్లబళ్లపై వస్తున్న ప్రజలు

పాదయాత్రకు సీపీఐ నాయకుల సంఘీభావం

అమరావతి రైతులకు అపూర్వ ఆదరణ

విశాలాంధ్ర-మచిలీపట్నం: అమరావతి రైతులు అరసవల్లికి చేపట్టిన పాదయాత్రకు బందరు మండలంలో అపూర్వ ఆదరణ లభించింది. గురువారం చిన్నాపురం నుంచి పాదయాత్ర మొదలైంది. తొలుత రైతులు అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అఖిలపక్ష నాయకులతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు. గుండుపాలెంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో రైతులు, అఖిలపక్ష నాయకులు పూజలు చేశారు. శారదానగర్, కాలేఖాన్‌పేట మీదుగా పాదయాత్ర సాగగా జైఅమరావతి, సేవ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఎడ్లబళ్లు, వెంకటేశ్వరస్వామి రథంతో యాత్ర సాగుతుండగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు వారితో కలిసి సాగారు. స్థానిక ప్రజలు అడుగడుగునా రైతులపై పూలవర్షం కురిపించారు. రైతుల పాదయాత్ర మధ్యాహ్నానికి రాజుపేటలోని షాదీఖానా వద్దకు చేరుకోగా రైతులకు అక్కడే భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం యాత్ర కోనేరు సెంటర్, రాజాగారి సెంటర్, రేవతి సెంటర్, బస్టాండ్, జిల్లా కోర్టు సెంటర్, లక్ష్మీటాకీస్ సెంటర్, జిల్లాపరిషత్ సెంటర్ మీదుగా పెడన వైపు సాగింది. పాదయాత్రలో మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర, రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు(బుల్లయ్య), గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ, కుంచె నాని, సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, లింగం ఫిలిప్, టి.తాతయ్య, సంగీతరావు, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి ఒడుగు రత్నకుమారి, జనసేన మచిలీపట్నం ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ మతీన్, కోకా ఫణిభూషణ్, నల్లబోలు కుమారి, రజియా సుల్తానా, పేరిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్డీఏ చట్ట సవరణ ప్రతులు దగ్ధం

న్యాయస్థానం తీర్పును ధిక్కరించి సీఆర్డీఏ చట్టాన్ని సవరిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టడాన్ని నిరసిస్తూ... కోనేరు సెంటర్‌లో జేఏసీ ప్రతినిధులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి, అమరావతినే రాజధానిగా కొనసాగించాలని నినదించారు. కార్యక్రమంలో మోటమర్రి బాబాప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, లింగం ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

బక్కచిక్కుతున్న రూపాయి

- అమెరికా వడ్డీ పెంపుతో విలవిల
- జీవితకాల కనిష్ఠానికి మారకం విలువ
- భారీగా పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్న మదుపర్లు

ముంబై: స్టాక్ మార్కెట్ ఒడిదొడుకులు, అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్ల పెంపు వగైరాలతో గురువారం రూపాయి విలువ జీవితకాల కనిష్ఠానికి పతనమైంది. ఓ దశలో దాదాపు 1.24 శాతం మేర నష్టపోయి డాలరుతో పోలిస్తే మారకం విలువ రూ.80.91 వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 90 పైసలు కుంగి రూ.80.86 వద్ద స్థిరపడింది. రూపాయికి ఇప్పటి వరకు ఇదే రికార్డు ముగింపు. అమెరికాలో వడ్డీరేట్ల పెంపుతో డాలర్ బలపడడం, ఈక్విటీ మార్కెట్లలో బలహీనతలు, చమురు ధరలు స్తబ్ధుగా ఉండడం.. రూపాయిపై ప్రభావం చూపుతున్నాయని ఫారెక్స్ ట్రేడర్లు చెబుతున్నారు. ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను మరో 75 పాయింట్లు పెంచుతున్నట్లు చైర్మన్ జెరోమ్ పావెల్ బుధవారం ప్రకటించారు. దీంతో అక్కడ వడ్డీరేట్లు 3.25 శాతానికి చేరాయి. ఈ సందర్భంగా పావెల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ముున్ముందు రేట్ల పెంపు విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఫలితంగా ఆర్థిక మాంద్యం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. సాధారణంగా యూఎస్‌లో వడ్డీరేట్లు పెరిగితే.. దేశీయ మార్కెట్ల నుంచి మదుపర్లు తమ పెట్టుబడుల్ని ఉపసంహరించుకుంటారు. అధిక రాబడి కోసం వాటిని అమెరికాకు తరలిస్తారు. ఫలితంగా డాలర్‌కు డిమాండ్ పెరిగి బలపడుతుంది. ఇది రూపాయిపై ఒత్తిడికి దారి తీస్తుంది.

సామాన్యుడి బతుకు భారమే...

రూపాయి క్షీణత వల్ల సామాన్యుడి బతుకు భారమవుతుంది. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. వస్తు సేవలకు అధికంగా చెల్లించాల్సి వస్తుంది. విదేశాల నుంచి దిగుమతయ్యే వంటనూనె, పప్పుదినుసులకూ అధిక ధరలు చెల్లించాలి. అంతర్జాతీయ వ్యాపారం డాలర్లలోనే జరుగుతుంది కాబట్టి, సరఫరా చేసిన దేశానికి వాటిల్లోనే చెల్లించాలి. రూపాయి విలువ క్షీణిస్తే డాలర్ల కోసం ఎక్కువ వెచ్చించాల్సి వస్తుంది. ముడి సరకుల్లో అత్యధిక భాగం దిగుమతి చేసుకునే పరిశ్రమలు కరెన్సీ విలువ క్షీణత వల్ల దెబ్బతింటాయి. ఇతర దేశాలకు విహారయాత్రలకు వెళ్లాలంటే అధికంగా ఖర్చవుతుంది. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులపై కూడా భారం పెరుగుతుంది. తమ వస్తువులను, సేవలను ఇతర దేశాలకు ఎగుమతి చేసే రంగాలు కరెన్సీ విలువ క్షీణత వల్ల లబ్ధి పొందుతాయి.

రూ.2,747 కోట్ల 'ఏబీజీ' ఆస్తులు అటాచ్ : ఈడీ

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో భాగంగా ఏబీజీ షిప్‌యార్డ్ లిమిటెడ్, దాని అనుబంధ కంపెనీలకు చెందిన రూ.2,747 కోట్ల విలువ చేసే ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. డాక్‌యార్డులు, వ్యవసాయ భూములు, బ్యాంకు డిపాజిట్లు, కమర్షియల్ ఆస్తుల విలువ మొత్తం రూ.2,747.69 కోట్లు అని ఈడీ వెల్లడించింది. సీజ్ చేసిన ఆస్తుల్లో గుజరాత్‌లోని సూరజ్, దలేజ్ షిప్‌యార్డులు, మహారాష్ట్ర, గుజరాత్‌లోని వివిధ కమర్షియల్- రెసిడెన్షియల్ ప్రాంగణాలు, ప్లాట్లు, వ్యవసాయ భూములు, ఏబీజీ షిప్‌యార్డ్ లిమిటెడ్, దాని గ్రూపు కంపెనీలు, సంబంధిత సంస్థల బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు ప్రకటించింది. కంపెనీ వ్యవస్థాపకుడు రిషి కమలేశ్ అగర్వాల్‌ను సీబీఐ అరెస్టు చేసిన తర్వాత ఈడీ ఈ చర్యలు తీసుకుంది. ముంబైలోని ఐసీఐసీఐ బ్యాంకు నేతృత్వ కన్సార్టియం నుంచి వేర్వేరు రుణ వసతులను / అప్పును ఏబీజీ షిప్‌యార్డ్ లిమిటెడ్, సంస్థ చైర్మన్, ఎండీ అగర్వాల్ పొందినట్లు విచారణలో తేలిందని ఈడీ వెల్లడించింది. బ్యాంకు రుణాలను ఏబీజీ షిప్‌యార్డ్ లిమిటెడ్ దుర్వినియోగించిందని, వేర్వేరు పనుల కోసం మళ్లించిందని పేర్కొంది. దేశవిదేశాల్లో అక్రమ లావాదేవీలకు ఉపయోగించిందని, తద్వారా బ్యాంకుల కన్సార్టియానికి రూ.22,852 కోట్ల నష్టం వచ్చిందని ఈడీ తెలిపింది. అటాచ్ చేసిన ఆస్తులు ఏబీజీ షిప్‌యార్డ్ లిమిటెడ్; దాని గ్రూపు కంపెనీలు బెర్మకో ఎనర్జీ సిస్టమ్స్ లిమిటెడ్, ధనరాజ్ దాతర్, సవితా ధనరాజ్ దాతర్, కృష్ణ గోపాల్ తోష్నివాల్, విరేన్ అహుజాలకు చెందినవిగా ఈడీ ప్రకటన పేర్కొంది.

ఐఆర్‌సీఎస్‌కు మార్పులు: మాండవియా

న్యూఢిల్లీ: మారుతున్న కాలానికి అనుగుణంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) గతిని పెంచుకోవాలని కేంద్ర ఆరోగ్యమంత్రి మన్సుక్ మాండవియా గురువారం నొక్కిచెప్పారు. వినూత్న, సహకార వెంచర్ల ద్వారా సాధ్యమైనంత ఎక్కువ మందికి సేవలు అందించగలగాలని అన్నారు. 'సేవా', 'సహకారం' అన్నవి తమ వారసత్వ సంస్కృతిలో సమగ్ర భాగమని ఐఆర్‌సీఎస్ చైర్మన్ కూడా అయిన మాండవియా తెలిపారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఐఆర్‌సీఎస్ ప్రతినిధుల సభలో ప్రసంగించారు. ఐఆర్‌సీఎస్ పనితీరు మెరుగుపర్చుకునే విధానాలపై చర్చ ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ' రెడ్ క్రాస్ అంటే ఆశా, తప్పక సాయం అందుతుందన్న భరోజా. మారుతున్న కాలానికి అనుగుణంగా గతిని ఐఆర్‌సీఎస్ పెంచుకోకపోతే గుర్తింపును కోల్పోవాల్సి రావచ్చు. బలాలు, బలహీనతలను ఆత్మపరిశీలన చేసుకోవడం సంస్థకు అవసరం. భవిష్యత్‌లో అనుసరించాల్సిన విధానాలు, మార్పులపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి. ఇందుకోసం వ్యవస్థాగత మార్పులు అవసరం కావచ్చు. సమస్య పరిష్కారానికి యంత్రాంగం, డిజిటల్ పరిజ్ఞానాన్ని మరింతగా వినియోగించుకోవడం కూడా కీలకం' అని మాండవియా నొక్కిచెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్రాల రెడ్ క్రాస్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కార్యదర్శులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

మత్స్యకారుల పడవను ఢీకొన్న విదేశీ నౌక

కొచ్చి: కేరళలోని కొచ్చి సముద్ర తీరంలోని హార్బర్‌లో గురువారం తెల్లవారుజామున ఒక విదేశీ వ్యాపార నౌక మత్స్యకారుల పడవను ఢీకొంది. ఈ ప్రమాదంలో కొందరు మత్స్యకారులు స్వల్పంగా గాయపడ్డారని బేపూర్‌లోని కోస్టల్ పోలీస్ స్టేషన్ అధికారి అప్పుట్టి తెలిపారు. గురువారం ఉదయం 5.30 ప్రాంతంలో 13 మందితో సముద్రంలోకి వెళుతున్న ఫిషింగ్ బోట్‌ను మలేషియాకు చెందిన ఒక నౌక ఢీకొన్నట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరుగలేదని చెప్పారు. ఫిషింగ్ బోట్ యజమాని అలీ అక్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు తెలిపారు. త్వరలో ఈ కేసును కొచ్చి కోస్టల్ పోలీసులకు అప్పగించనున్నట్టు తెలిపారు.

త్వరలో కార్తికేయ-3: నిఖిల్

హైదరాబాద్: హీరో నిఖిల్ సిద్ధార్థ్ ఇప్పుడు స్టార్ హీరోనే కాదు పాన్ ఇండియా హీరో. ఆయన హీరోగా నటించిన 'కార్తికేయ 2' చిత్రం ఊహించని విధంగా విజయం సాధించి.. బాలీవుడ్‌లో సైతం అతని పేరు వినబడేలా చేసింది. బాలీవుడ్ డైరెక్ట్ సినిమాలకు పోటీ ఇస్తూ.. 'కార్తికేయ 2' సృష్టించిన ప్రభంజనం ఏంటో.. హిందీ బెల్ట్‌లో ఆ సినిమా సాధించిన కలెక్షన్లే చెబుతున్నాయి. 'కార్తికేయ' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం అంతగా ప్రేక్షకులలోకి వెళ్లిపోయింది. 'కార్తికేయ 2'నే కాదు.. దానికి కూడా కొనసాగింపు ఉంటుందనేలా ఇప్పటికే దర్శకుడు చందూ మొండేటి క్లారిటీ ఇచ్చేశారు. ప్రస్తుతం 'కార్తికేయ 3' కి సంబంధించిన కథని కూడా సిద్ధం చేసే పనిలో ఆయన నిమగ్నమై ఉన్నట్లుగా టాక్ నడుస్తోంది. ఇదిలా ఉంటే.. 'కార్తికేయ 3'కి సంబంధించి హీరో నిఖిల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడి.. ఈసారి రాబోయే పార్ట్ మాములుగా ఉండదు అనేలా హింట్ ఇచ్చేశాడు. "కార్తికేయ, కార్తికేయ-2 చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మా ప్రయత్నం నచ్చినందుకు మేమంతా చాలా హ్యాపీగా ఉన్నాం. వారి దీవెనలతో త్వరలోనే 'కార్తికేయ-3'కి శ్రీకారం చుట్టబోతున్నాం. ఈ సినిమా ఎప్పుడు మొదలుపెడతామో, ఎప్పుడు పూర్తి చేస్తామో.. అనే దానిపై నేను కూడా చాలా ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను. ఎందుకంటే ఈసారి చేయబోయే పార్ట్ 3డీ వెర్షన్‌లో ఉండబోతుంది" అని నిఖిల్ చెప్పుకొచ్చారు.

కర్నూలులో 'ది ఘోస్ట్' ప్రీ రిలీజ్ ఈవెంట్

హైదరాబాద్: నాగార్జున హీరోగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న 'ది ఘోస్ట్' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈ నెల 25న కర్నూలులో జరగనున్నది. అక్కడి ఎస్టీబీసీ గ్రౌండ్‌లో జరిగే వేడుకకు యూనిట్ సభ్యులంతా హాజరు కానున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకొన్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. నాగార్జున, సోనాల్ చౌహాన్‌ల అద్భుతమైన కెమిస్ట్రీతో విడుదలైన ఫస్ట్ సింగిల్ ఇప్పటికే యువతను ఆకట్టుకుంటోంది. అక్టోబర్ 5న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు, శరత్ మరార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

శరీరం సహకరించడం లేదు: కాజల్

ముంబై: పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చారు కాజల్ అగర్వాల్. ఏడాది తిరిగే లోపు పండంటి బిడ్డకు జన్మనిచ్చారామె. అప్పటి నుంచి తన బిడ్డతోనే గడుపుతూ మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇప్పుడు విరామానికి బ్రేక్ ఇవ్వనున్నారు కాజల్. తిరిగి షూటింగ్‌లో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం కాజల్ ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టారు. జిమ్, వర్కవుట్స్ అంటూ బిజీబిజీగా ఉన్నారు. బుధవారం గుర్రపు స్వారీ చేస్తున్న వీడియో ఇన్‌స్టాలో షేర్ చేశారు కాజల్. అంతే కాదు బాబు పుట్టిన తర్వాత శరీరంలో వచ్చిన మార్పులు గురించి ఓ పోస్ట్ చేశారు. 'నా బిడ్డ నీల్ కిచ్లు పుట్టి ఐదు నెలల కావొస్తోంది. ప్రస్తుతం తన ఆలనాపాలనా చూసుకోవడానికే టైమ్ సరిపోవడం లేదు. త్వరగా షూటింగ్ సెట్‌లో అడుగుపెట్టాలనుంది. అందుకోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. త్వరలోనే పనిలో పడబోతున్నా. అయితే ఒకప్పటిలా నాకు ఇప్పుడు ఉండదు. ఏడాది క్రితం నా శరీరం ఎలా ఉండేదో.. ఇప్పుడు అలా లేదు. నీల్ పుట్టాక వర్కవుట్స్ చేయకుండా బాడీ రిలాక్స్ అయిపోయింది. డెలివరీ తర్వాత అప్పటి ఎనర్జీ లెవల్స్‌ని సాధించడం కష్టంతో కూడిన పనే. గుర్రాన్ని ఎక్కడం, దానిపై స్వారీ చేయడం ఇప్పుడు నాకు పెద్ద పనిలా అనిపించింది. అంతకు ముందు ఎక్సర్‌సైజ్ అంటే చాలా ఈజీగా అనిపించేది. ఇప్పుడు బాడీ దానికి సహకరించట్లేదు. కానీ మనలో నేర్చుకోవాలనే తపనకు ఏదీ అడ్డంకి కాదు. మన సెలక్షన్‌కు ఇంపార్టెన్స్ ఇస్తూ ముందుకెళ్లాలి" అని కాజల్ పేర్కొన్నారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో
బీజేపీ ఖర్చు రూ.340 కోట్లు

- యూపీలోనే అత్యధిక వ్యయం
- కాంగ్రెస్ ఖర్చు 194 కోట్లు
- ఈసీ గణాంకాలు వెల్లడి

న్యూఢిల్లీ: ఈ ఏడాది జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారం కోసం బీజేపీ భారీగా ఖర్చుచేసింది. ఆ పార్టీ దాదాపు 340 కోట్లు ఖర్చు చేసినట్లు ఎన్నికల సంఘం నివేదిక ద్వారా వెల్లడైంది. ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల ప్రచారానికి బీజేపీ అత్యధికంగా ఖర్చుపెట్టింది. ఇక ఆ రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ పార్టీ తమ ప్రచారం కోసం సుమారు 194 కోట్లు ఖర్చు చేసినట్లు ఈసీ తెలిపింది. బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన ఎన్నికల ఖర్చు నివేదికలను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ తమ పార్టీ ప్రచారం కోసం 340 కోట్లు ఖర్చు చేసింది. యూపీలో 221, మణిపూర్‌లో 23, ఉత్తరాఖండ్‌లో 43, పంజాబ్‌లో 36, గోవాలో 19 కోట్లు కాషాయ పార్టీ ఖర్చు చేసింది . ఈ ఐదు రాష్ట్రాల్లోనే 194 కోట్లు ఖర్చు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఈసీకి తెలిపింది.

ఇక ఈ ఐదు రాష్ట్రాల్లో తృణమూల్ కాంగ్రెస్ రూ.47.54 కోట్లు, ఆప్ రూ.11.32కోట్లు వెచ్చించినట్లు ఆయా పార్టీల నివేదికలు పేర్కొన్నాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు తప్పనిసరిగా తమ ఎన్నికల వ్యయాల నివేదికలను ఈసీకి సమర్పించాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరి - మార్చిలో ఉత్తరప్రదేశ్ సహా ఐదు రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లో మరోసారి కాషాయపార్టీ విజయం సాధించగా, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించింది. ఉత్తరాఖండ్, మణిపూర్, గోవాల్లోనూ కాషాయ పార్టీ గెలుపొందింది. పంజాబ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అంతర్గత కలహాల కారణంగా పరాజయం చవిచూసింది. ఇతర రాష్ట్రాల్లోనూ ఆ పార్టీకి పరాభవం తప్పలేదు.

సుప్రీంకు వెళతాం

- గవర్నర్ చర్యపై ఆప్ సర్కార్
- 27న పంజాబ్ అసెంబ్లీ సమావేశం: సీఎం మాన్

చండీగఢ్: పంజాబ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించకుండా గవర్నర్ అడ్డుకోవడం నిరంకుశత్వమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతృత్వ భగవంత్ మాన్ ప్రభుత్వం ఆరోపించింది. దీనిపై సర్వోన్నత న్యాయస్థానానికి వెళతామని ప్రకటించింది. ఈమేరకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయించినట్లు తెలిపింది. అసెంబ్లీ సమావేశాన్ని ఈనెల 27న నిర్వహించేందుకు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు వెల్లడించింది. గవర్నర్ ఏకపక్షంగా వ్యవహరించారని, ఆయన తీరు అప్రజాస్వామికమని మాన్ ప్రభుత్వం విమర్శించింది. గురువారం కేబినెట్ సమావేశానికి ముందు పార్టీ ఎమ్మెల్యేలతో విధాన సభ కాంపెక్స్‌లో మాన్ భేటీ అయ్యారు. పార్టీ తదుపరి కార్యాచరణను చర్చించారు. ఈనెల 27న అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు కేబినెట్ సమావేశం అనంతరం వీడియో సందేశంలో మాన్ తెలిపారు. విద్యుత్ సరఫరా, పంట వ్యర్థాల వంటి అంశాలను చర్చిస్తామన్నారు. రాష్ట్రాల ఫెడరల్ హక్కులు, ప్రజల ప్రజాస్వామిక హక్కుల సంరక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తూ గవర్నర్ తీసుకున్న ఏకపక్ష, అప్రజాస్వామిక నిర్ణయంపై సుప్రీంకు వెళ్లాలని నిర్ణయించినట్లు అనంతరం ఒక ప్రకటనలో సీఎం తెలిపారు. బీజేపీ ఆపరేషన్ కమలానికి కాంగ్రెస్ మద్దతిస్తోందని ఆరోపించారు. అప్రజాస్వామిక ఆపరేషన్‌కు బలైకూడా కాషాయ పార్టీ పక్షాన కాంగ్రెస్ నిలవడం హాస్యాస్పదమని మాన్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, శిరోమణి అకాలీ దళ్, బీజేపీ ఏకమై ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రాంతీయ పార్టీలను అణచివేసి అధికారం తమకే దక్కాలని కాంగ్రెస్, బీజేపీ భావిస్తున్నాయని విమర్శించారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని, ప్రజాస్వామ్యంలో ప్రజలకు మించి ఎవరూలేరన్న సందేశాన్ని యావత్ దేశానికి పంజాబ్ ఇవ్వనుందని మాన్ తేల్చిచెప్పారు.

ఝులన్‌కు ఘన వీడ్కోలు ఇస్తాం: హర్మన్

లండన్: వెటరన్ పేసర్ ఝులన్ గోస్వామి రిటైర్మెంట్‌కు సిద్ధమైంది. శనివారం లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరగనున్న మూడో వన్డే అనంతరం అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ కానుంది. ఇక ఝులన్ గోస్వామి రిటైర్మెంట్ తమ జట్టుకు చాలా ఎమోషనల్‌గా ఉంటుందని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అన్నారు. మూడు గేమ్‌ల సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌లను గెలుచుకోవడం ద్వారా భారత్ ఇప్పటికే వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. తద్వారా గోస్వామికి సరైన వీడ్కోలు పలకడానికి వేదిక ఖరారైంది. 'లార్డ్స్ గేమ్ మాకు చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇది ఝులన్ రిటైర్మెంట్. ఆ గేమ్‌ను ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆస్వాదించాలనుకుంటున్నాం. మేం ఈ రోజు గెలవగలిగాం. ఇప్పుడు సిరీస్ గెలుపొందాం. ఎలాంటి ఒత్తిడి లేకుండా చివరి మ్యాచ్‌లోనూ రాణిస్తాం. ఆమె కోసం ఆ మ్యాచ్ గెలవాలని చూస్తున్నాం' అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. భారత క్రికెట్‌కు గోస్వామి చేసిన అపారమైన సహకారాన్ని గురించి హర్మన్‌ప్రీత్ పేర్కొంది. 'ఆమె నుంచి మేం చాలా విషయాలు నేర్చుకున్నాం. నేను అరంగేట్రం చేసినప్పుడు ఆమె కెప్టెన్. ఇప్పుడు మా జట్టు యువ బౌలర్లు రేణుక సింగ్, మేఘనా సింగ్ ఆమె నుంచి నేర్చుకున్నారు. ఆమె ద్వారా బౌలింగ్ రిథమ్ గురించి అవగాహన పొందుతు న్నారు. ఆమె మా అందరికీ గొప్ప ప్రేరణ.' అని హర్మన్ చెప్పింది. ఝులన్ గోస్వామి 12 టెస్టులు, 68 టీ20లు, 203 వన్డేలు ఆడింది. అన్ని ఫార్మాట్లలో కలిపి ఇప్పటివరకు 353 అంతర్జాతీయ వికెట్లు తీసింది. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఆమె కొనసాగుతోంది.

వచ్చే ఏడాది మహిళల టీ20 లీగ్

రాష్ట్రాల సంఘాలకు గంగూలీ కీలక సమాచారం!

కోల్‌కతా: భారత్ టీ20 లీగ్‌కు ప్రపంచవ్యాప్తంగా ఎంత ఆదరణ ఉందో అందరికీ తెలుసు. అలాగే మహిళలకూ ప్రత్యేకంగా టీ20 లీగ్‌ను నిర్వహించాలని మాజీలు సహా ప్రస్తుత క్రికెటర్ల నుంచి విజ్ఞప్తులు భారీగా వచ్చాయి. టీ20 ఛాలెంజ్ పేరిట కొన్ని మ్యాచ్‌లను నిర్వహిస్తున్నప్పటికీ.. తమకూ ఇటువంటి లీగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ రాష్ట్రాల క్రికెట్ సంఘాలకు గురువారం కీలక సమాచారం తెలియజేశాడు. వచ్చే ఏడాది నుంచి మహిళల భారత టీ20 లీగ్ నిర్వహించే అవకాశం ఉందని గంగూలీ పేర్కొన్నాడు. పురుషుల భారత టీ20 లీగ్‌కు సంబంధించి కూడా గంగూలీ కీలక ప్రకటన చేశాడు. కరోనాకు ముందు నిర్వహించినట్లు 'సొంత మైదానం-బయట మైదానం' తరహాలో వచ్చే సీజన్‌ను నిర్వహిస్తామని గంగూలీ పేర్కొన్నాడు. గత సీజన్‌ను కేవలం నాలుగు మైదానాలకే పరిమితం చేసిన విషయం తెలిసిందే. 'ప్రస్తుతం బీసీసీఐ మహిళల టీ20 లీగ్‌పైనా కసరత్తు చేస్తోంది. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఈ టోర్నీ వచ్చే ఏడాది నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నాం. అలాగే పురుషుల టీ20 లీగ్ కూడా గతంలో జట్టుకు సొంత మైదానాల్లో ఆడే అవకాశం ఉండేది. అయితే, కరోనా కారణంగా గత సీజన్‌లో కుదరలేదు. అందుకే వచ్చే సీజన్‌కు ఆ విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం" అని గంగూలీ రాష్ట్రాలకు తెలిపినట్లు తెలిసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.